


# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

GST No.37ACDFM5465G1Z1

RNI-APTEL/2012/46499

No: KNL/3`78(D)/2026`2028


ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యం: జిల్లా ఇన్‌చార్జి మంత్రి.




Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ | సంపుటి -14 | సంచిక - 160 | పేజీలు - 08 | వెల - 05/-

మంగళవారం 09-06-2026


# విశాఖ ఉక్కులో ఘోరం

**మృతుల కుటుంబాలకు 25 లక్షల పరిహారం**

- 9 మంది సిబ్బంది దుర్మరణం
- స్టీల్‌ప్లాంట్‌లో పేలిన ల్యాడిల్
- చుట్టుపక్కలకు చిమ్మిన హాట్ మెటల్
- 1500 డిగ్రీల ఉష్ణోగ్రతతో కుతకుత
- అగ్నిగోళం బద్దలైనట్టుగా మంటలు
- బొగ్గుల్లా మారిన మృతదేహాలు
- క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమం

*విశాఖ స్టీల్‌ప్లాంటులో పెను ప్రమాదం చోటుచేసుకుంది. 1500 డిగ్రీల వేడితో... సలసలా కాగే హాట్ మెటల్‌ను తీసుకెళ్తున్న ల్యాడిల్ పేలిపోయింది. ఆ ద్రవం మీద పడి తొమ్మిది మంది సిబ్బంది మృతి చెందారు. ఈ ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. మృతుల్లో మేనేజర్ నుంచి కాంట్రాక్టు కార్మికుల వరకు ఉన్నారు.*



విశాఖపట్నం/గాజువాక/ఉక్కు టౌన్‌షిప్, జూన్ 8 : విశాఖ ఉక్కు కర్మాగారంలో ఘోర ప్రమాదం జరిగింది. 9 మంది సిబ్బంది మంటల్లో సజీవ దహనమైపోయారు. ఏం జరిగిందో తెలిసేలోపే బొగ్గుల్లా మాడిపోయారు. హాట్ మెటల్ విరుచుకుపడటంతో అగ్నిగోళం బద్దలయినట్లు.. ఆ ప్రాంగణం దాదాపు రెండు గంటలపాటు ఎగసిపడే మంటలతో భీతిగొలిపింది. హాట్ మెటల్‌ను తీసుకెళ్లే ల్యాడిల్ పేలడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఉద్యోగ వర్గాల కథనం ప్రకారం... విశాఖ ఉక్కు కర్మాగారంలోని స్టీల్ మెల్టింగ్ షాపు-1లో సోమవారం సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో సుమారు 20 మంది సిబ్బంది పని చేస్తున్నారు. లిక్విడ్ స్టీల్‌గా మారడానికి ముందు దశ అయిన హాట్ మెటల్‌ను ల్యాడిల్‌లలో భారీ కొక్కేనికి తగిలించి తరలిస్తారు. ఈహాటల్ మెటల్‌ను శుద్ధి చేసి... 'మౌల్డింగ్'లలోకి ఒంపుతారు. ఒకరకంగా చెప్పాలంటే... ఉక్కు అచ్చులను తయారు చేసే ప్రక్రియ ఇది. ఇలా ల్యాడిల్‌లో తరలిస్తున్న హాట్ మెటల్ ఒక్కోసారి కొద్దిగా ఒలికిపోవడం, చిన్నపాటి ప్రమాదాలు చోటుచేసుకోవడం అరుదుగా జరుగుతుంటుంది. కానీ... సోమవారం ల్యాడిల్ పేలిపోయి 150 టన్నుల దాకా ఉన్న హాట్ మెటల్ ఒక్కసారిగా చుట్టూ విరజిమ్మింది. అగ్నిపర్వతం నుంచి వెలువడే లావా తరహాలో చుట్టుపక్కల 25 అడుగుల వరకు విరుచుకుపడింది. అది పడిన చోటల్లా మంటలు చెలరేగాయి. మిగతాది 2లో

# దేశాన్ని విడదీయొద్దు..
## రేవంత్ రెడ్డికి 'ఇండీ' మిత్రపక్షం హితవు!

**ప్రధాని, రాష్ట్రపతి ఇద్దరూ ఉత్తర భారత్‌కు చెందినవారేనన్న రేవంత్ రెడ్డి**



- దక్షిణ భారత ప్రజలు రెండో శ్రేణి పౌరులుగా ఉండలేరని వ్యాఖ్య
- రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను తప్పుబట్టిన శివసేన(యూబీటీ)
- యుద్ధం వస్తే భారతీయులుగానే పోరాడతామని ఉద్బోధ

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల ఓ కార్యక్రమంలో చేసిన 'ఉత్తర-దక్షిణ భారత' వ్యాఖ్యలపై 'ఇండీ' కూటమి మిత్రపక్షం శివసేన (యూబీటీ) తీవ్రంగా స్పందించింది. దేశాన్ని రాష్ట్రాల వారీగా ముక్కలు చేసేలా మాట్లాడటం ఏమాత్రం సరికాదని హితవు పలికింది. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న రేవంత్ రెడ్డి ప్రాంతీయ విభేదాల కంటే జాతీయ ఐక్యతకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. ఈ వివాదంపై శివసేన (యూబీటీ) అధికార ప్రతినిధి ఆనంద్ దూబే మాట్లాడుతూ.. "మన భారతదేశం ఓ అందమైన పూలగుచ్ఛం లాంటిది. అందులో ఒక్కో పువ్వు ఒక్కో రంగులో, ఒక్కో సువాసనతో ఉంటుంది. కానీ అవన్నీ కలిస్తేనే ఒక అందమైన గుచ్ఛం అవుతుంది" అని దూబే వ్యాఖ్యానించారు. భౌగోళిక, భాషా వ్యత్యాసాలతో సంబంధం

# ఇది ఇడ్లీ... ఐటీ ఇంజినీర్ కు శశి థరూర్ క్లాస్!



- ఇడ్లీని పిజ్జాలా కట్ చేసిన ఫొటోపై శశిథరూర్ స్పందన
- ఇది ఇడ్లీ, 'ఇడ్-స్లైస్' కాదంటూ చమత్కార వ్యాఖ్య
- సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ వంటగదిలోకి వెళితే ఇలాగే ఉంటుందని సెటైర్
- గతంలోనూ ఇడ్లీ గొప్పతనాన్ని వర్ణించిన కాంగ్రెస్ నేత
- సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న శశిథరూర్ పోస్ట్

కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ శశిథరూర్ తనదైన శైలిలో మరోసారి సామాజిక మాధ్యమాల్లో సందడి చేశారు. దక్షిణాది సంప్రదాయ వంటకం ఇడ్లీని

# ఇజ్రాయెల్ పై చర్యలు నిలిపివేస్తున్నాం



- ఇరు దేశాల మధ్య క్షిపణి దాడులు జరిగిన కొన్ని గంటల్లోనే నిర్ణయం
- లెబనాన్‌లో దాడులు కొనసాగిస్తే తీవ్ర పరిణామాలుంటాయని ఇరాన్ హెచ్చరిక
- ఉద్రిక్తతలు తగ్గడంతో అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల స్పందన
- అమెరికా జోక్యంతో కాల్పుల విరమణకు ఇరుపక్షాలు అంగీకారం

ఇజ్రాయెల్‌తో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ కీలక

# విశాఖ స్టీల్ ప్లాంట్
## ప్రమాదంలో 9కి పెరిగిన మృతుల సంఖ్య..

**ఘటన స్థలిని పరిశీలించిన హోంమంత్రి అనిత, ఎంపీ భరత్**



- విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాద స్థలాన్ని సందర్శించిన హోంమంత్రి అనిత
- ప్రమాదం జరిగిన తీరును ఉద్యోగులను అడిగి తెలుసుకున్న వైనం
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ఆదేశం

విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో సోమవారం సాయంత్రం జరిగిన ఘోర ప్రమాదంలో మృతుల సంఖ్య 9కి పెరిగింది. రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ ప్రమాద స్థలాన్ని సందర్శించారు. ఈ దుర్ఘటన జరిగిన తీరును వారు పరిశీలించారు. ప్లాంట్‌లోని ఎస్ఎంఎస్-2, రాజ-3 విభాగాల్లో వేడి లోహ ద్రవం లీకైన ప్రదేశాన్ని హోంమంత్రి అనిత, ఎంపీ శ్రీభరత్ క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రమాదం ఎలా జరిగిందనే మిగతాది 2లో



# ఢిల్లీలో సమావేశమైన
## విపక్ష కూటమిలోని పార్టీల నాయకులు

- విభేదాలు పక్కనపెట్టి ఐక్యంగా ఉండాలని రాహుల్ గాంధీ పిలుపు
- ఓటర్ల జాబితాలో అవకతవకలపై సీజేఐకి ఫిర్యాదుకు నిర్ణయం
- కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్
- ప్రతి రెండు నెలలకోసారి సమావేశం కావాలని కూటమి తీర్మానం

## ఫడ్నవీస్ అపాయింట్‌మెంట్‌పై రేవంత్ అబద్ధం
# చెబుతున్నారు: బీజేపీ

**రాజ్యాంగ పదవిలో ఉండి రేవంత్ రెడ్డి అసత్యాలు చెబుతున్నారని బీజేపీ ఆరోపణ**



- మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్ అపాయింట్‌మెంట్ కోరారనడం అవాస్తవమని విమర్శ
- ఫడ్నవీస్ కార్యాలయం నుంచి ఎలాంటి అపాయింట్‌మెంట్ కోరలేదని వెల్లడి
- కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్తర, దక్షిణ భారత రాజకీయాలు చేస్తోందని ఆరోపణ

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి కూడా అసత్య ప్రచారాలు చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్రంగా ఆరోపించారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌ను కలిసేందుకు ప్రయత్నించానని రేవంత్ రెడ్డి చెప్పడం పూర్తిగా అవాస్తవమని ఆయన విమర్శించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాంచందర్ రావు మాట్లాడుతూ, ఫడ్నవీస్‌తో భేటీ కోసం రేవంత్ రెడ్డి ఎలాంటి అపాయింట్‌మెంట్ కోరలేదని, ఈ విషయాన్ని ఫడ్నవీస్ కార్యాలయమే మిగతాది 2లో

# పరీక్షలంటే తెలియని వారు కూడా బురద జల్లుతున్నారు




- ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో భూములు కాజేసే ప్రయత్నం జరిగిందని ఆరోపణ
- భద్రతా ఫీచర్లతో రాజముద్ర వేసి కొత్త పాస్‌బుక్కులు ఇస్తున్నామని వెల్లడి
- రికార్డులు ఫోర్జరీ చేసిన ఎమ్మెల్యేపై వైసీపీ ఎందుకు చర్యలు తీసుకోలేదు? అంటూ ప్రశ్న
- గొడ్డలి పార్టీకి రాష్ట్రంలో రాజకీయాలు చేసే అర్హత లేదంటూ ఫైర్
- ఆక్వా రైతులకు అండగా ఉంటాం.. కేంద్రంతో మాట్లాడుతున్నామని భరోసా

పరీక్షలు అంటే ఏమిటో, రిజర్వేషన్లు అంటే ఏమిటో తెలియని వ్యక్తులు డీఎస్సీ నియామకాలపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం సిద్ధాంతంలో నిర్వహించిన 'మీ భూమి – మీ హక్కు' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, వైసీపీపై తీవ్ర విమర్శలు చేశారు. మిగతాది 2లో

# స్కూళ్ల కుదింపు.. రేవంత్ సర్కార్‌పై కవిత తీవ్ర విమర్శలు



- తెలంగాణలో స్కూళ్ల కుదింపుపై మొదలైన రాజకీయ దుమారం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయంపై బీఆర్ఎస్ నేత కవిత ఫైర్
- 27,000 పాఠశాలలను 4,000గా మార్చడం దారుణమన్న కవిత
- ఈ నిర్ణయం పేద, బాలికల విద్యకు గొడ్డలిపెట్టని విమర్శ
- గురుకులాల్లో విద్యార్థుల మరణాలపై సమీక్షించలేదని ఆరోపణ

రాష్ట్రంలో ఉన్న 27,000 పాఠశాలలను 4,000కు కుదించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడం

# ఢిల్లీలో సమావేశమైన విపక్ష కూటమిలోని పార్టీల నాయకులు

బీజేపీ నుంచి ఎదురవుతున్న సవాళ్లను దీటుగా ఎదుర్కొనేందుకు మిత్రపక్షాలన్నీ విభేదాలను పక్కనపెట్టి




ఏకతాటిపైకి రావాలని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. సోమవారం ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో నిర్వహించిన 'ఇండియా' కూటమి సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఒకరినొకరు విమర్శించుకోవడం మానుకొని, సమైక్యంగా ముందుకు సాగాలని మిత్రపక్షాలకు సూచించారు. సుమారు 15 నిమిషాల పాటు ప్రసంగించిన రాహుల్, "కలిసికట్టుగా ఉంటేనే మన మనుగడ సాధ్యం" అని స్పష్టం చేశారు. రాజ్యాంగ పరిరక్షణకు, అధికార పక్షాన్ని సమర్థంగా ఎదుర్కోవడానికి సంఘీభావం అత్యవసరమని పేర్కొన్నారు. అయితే, ఓటర్ల జాబితాలో జరుగుతున్న అవకతవకలపై కొన్ని మిత్రపక్షాల నుంచి తగిన స్థాయిలో మద్దతు లభించలేదని ఆయన ఈ సందర్భంగా అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ, లోక్‌సభలో డీలిమిటేషన్ బిల్లుల విషయంలో విపక్షాలు సాధించిన విజయాన్ని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో కూటమిని మరింత బలోపేతం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో తృణమూల్ కాంగ్రెస్ నేతలు మమతా బెనర్జీ, అభిషేక్ బెనర్జీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, వామపక్ష ప్రతినిధులతో సహా మొత్తం 23 పార్టీల నేతలు పాల్గొన్నారు. కాగా, ఈ భేటీకి డీఎంకే గైర్హాజరయ్యింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఓటర్ల జాబితాలో అక్రమాలు జరుగుతున్నాయన్న ఆరోపణలపై భారత ప్రధాన న్యాయమూర్తికి (సీజేఐ) ఫిర్యాదు చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. అదేవిధంగా, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కూటమి పార్టీల మధ్య నిరంతర సమన్వయం కోసం ప్రతి రెండు నెలలకు ఒకసారి సమావేశం కావాలని, తదుపరి భేటీని ఆగస్టులో హైదరాబాద్‌లో నిర్వహించాలని నిర్ణయించారు.

# స్కూళ్ల కుదింపు.. రేవంత్ సర్కార్‌పై కవిత తీవ్ర విమర్శలు

రాష్ట్రంలో ఉన్న 27,000 పాఠశాలలను 4,000కు కుదించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడం తీవ్ర అభ్యంతరకరమని టీఆర్ఎస్ చీఫ్, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వపు ఈ నిర్ణయం పేద విద్యార్థులను, ముఖ్యంగా బాలికలను విద్యకు దూరం చేసేలా ఉందని ఆమె ఆరోపించారు. సోమవారం విడుదల చేసిన ఒక వీడియో ప్రకటనలో కవిత ప్రభుత్వ తీరును తీవ్రంగా తప్పుపట్టారు. ఈ నిర్ణయం అత్యంత దారుణమని ఆమె అభివర్ణించారు. రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో సుమారు 100 మందికి పైగా విద్యార్థులు మరణించినా, కనీసం సమీక్ష కూడా నిర్వహించని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇప్పుడు పాఠశాలలు మూసివేతపై దృష్టి సారించడాన్ని ఆమె విమర్శించారు. విద్యాశాఖపై ప్రభుత్వానికి కనీస పట్టు లేదని ఈ నిర్ణయం స్పష్టం చేస్తోందని ఆమె వ్యాఖ్యానించారు.
బెంగళూరులో జరిగిన ఒక కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. రాష్ట్రంలోని 27,000 ప్రభుత్వ పాఠశాలల్లో 18 లక్షల మంది విద్యార్థులుండగా, 12,000 ప్రైవేట్ స్కూళ్లలో 35 లక్షల మంది చదువుతున్నారని ఆయన గణాంకాలను వెల్లడించారు. నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఒకేచోట విద్య, ఉచిత రవాణా, భోజన వసతులతో కూడిన 'సమీకృత పాఠశాలలను' ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పాఠశాలల హేతుబద్ధీకరణ పేరుతో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, వాటిపై ప్రతిపక్షాల నుంచి వస్తున్న విమర్శలతో రాష్ట్రం విద్యా రంగంపై చర్చ మరోసారి తీవ్రస్థాయికి చేరింది. కవిత చేసిన ఆరోపణలపై ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పందన రాలేదు.

# విశాఖ ఉక్కులో ఘోరం

చిన్నపాటి ప్రమాదాలు చోటుచేసుకోవడం అరుదుగా జరుగుతుంటుంది. కానీ... సోమవారం ల్యాడిల్



పేలిపోయి 150 టన్నుల దాకా ఉన్న హాట్ మెటల్ ఒక్కసారిగా చుట్టూ విరజిమ్మింది. అగ్నిపర్వతం నుంచి వెలువడే లావా తరహాలో చుట్టుపక్కల 25 అడుగుల వరకు విరుచుకుపడింది. అది పడిన చోటల్లా మంటలు చెలరేగాయి. ల్యాడిల్‌కు పది అడుగుల దూరంలోనే కార్మికులు, సిబ్బందిపై హాట్ మెటల్ పడటంతో భారీగా ప్రాణనష్టం సంభవించింది.

ఏమిటి కారణం...

హాట్ మెటల్‌ను తరలించే ల్యాడిల్ పేలడం విశాఖ ఉక్కు చరిత్రలోనే కాదు... దేశంలోనే ఇదే మొదటిసారి అని తెలుస్తోంది. దీనికి కారణంపై పలురకాల వాదనలు వినిపిస్తున్నాయి. ఒక కథనం ప్రకారం... హాట్ మెటల్‌లోని మలినాలు తొలగించి, శుద్ధమైన ఉక్కు తయారీ కోసం అల్యూమినియం, ఫెర్రో అలాయ్స్ వంటి కొన్నిరకాల 'మెటల్ యాడిటివ్స్' కలుపుతారు. వాటిని ఆక్సిజన్‌తో 'బ్లో' చేస్తారు. ఈ క్రమంలో ఎక్కడో జరిగిన పొరపాటువల్ల మెటల్స్‌లో రియాక్షన్ జరిగి పేలుడు సంభవించినట్లు అనుమానిస్తున్నారు. తాజా ప్రమాదంలో భారీగా ప్రాణ నష్టంతోపాటు స్టీల్‌ప్లాంట్‌కు ఆస్తి నష్టమూ వాటిల్లింది. ఎస్ఎంఎస్-1 ప్రాంగణం చాలావరకు అగ్నికీలల్లో చిక్కుకుంది. ఒక క్రేన్ కాలిపోయింది.

పని ఒత్తిడితో సతమతం...

ఇటీవల ఉక్కు ఉద్యోగులపై పని ఒత్తిడి పెరిగింది. ఎనిమిది గంటలకు బదులు 12 గంటలు డ్యూటీ చేయిస్తున్నారు. ఇటీవల కాలంలో చాలామంది ఉద్యోగులకు వీఆర్ఎస్ ఇచ్చి పంపించేశారు. కాంట్రాక్టు కార్మికులను సగానికి తగ్గించేశారు. వేలాది మందిని తొలగించి 100 శాతం ఉత్పత్తి చేయాలని లక్ష్యం ఇస్తున్నారు. గత నవంబరు నుంచి ఉత్పత్తి ఆధారిత జీతాలను అమలు చేస్తున్నారు. దాంతో ఉద్యోగులు భద్రతా ప్రమాణాలకు సంబంధించిన ప్రొటోకాల్‌ను పాటించలేకపోతున్నారు. త్వరత్వరగా ప్రక్రియలు పూర్తిచేసే హడావిడిలో ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయి. సమయం అయిపోతున్నదనే తొందరలో ల్యాడిల్‌ను పరిమిత వేగానికి మించి కదిలిస్తే, అది బ్యాలెన్స్ తప్పి ఇలాంటి ప్రమాదం జరిగే అవకాశం ఉందని, దాన్ని కూడా కొట్టి పారేయలేమని యూనియన్ నాయకులు చెబుతున్నారు.

ప్రైవేటు నిర్లక్ష్యమా?

స్టీల్ మెల్టింగ్ షాపు-1 నిర్వహణ పనులను ఓ ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించారు. నిర్వహణ లోపం వల్లనే ఈ ప్రమాదం జరిగిందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. కాగా, ప్రమాద స్థలిని ఉక్కు అధికారులు సోమవారం రాత్రి పరిశీలించారు. మళ్లీ ఉత్పత్తి ప్రారంభించేందుకు గల అవకాశాలపై చర్చించారు. అయితే రాత్రి విధులకు హాజరయ్యేందుకు సంబంధిత విభాగంలోని కార్మికులు విముఖత వ్యక్తం చేశారు. యాజమాన్యం తమకు పూర్తి భద్రత కల్పిస్తేనే విధులకు హాజరవుతామని స్పష్టంచేశారు. ఆ ప్రాంతమంతా పోలీసులు బారికేడ్లు ఏర్పాటుచేశారు.

షిఫ్టు మార్చుకుని ప్రాణాలు కోల్పోయాడు

ఎం.కృష్ణ నాగ్ (56) స్టీల్ ప్లాంటులో జనరల్ ఫోర్‌మెన్‌గా పనిచేస్తున్నారు. ఆయన సోమవారం సి - షిఫ్ట్ డ్యూటీకి వెళ్లాల్సి ఉంది. కానీ డ్యూటీని బి-షి?ఫ్టనకు మార్చుకొని విధులకు హాజరయ్యారు. స్టీల్ మెల్టింగ్ షాపులో ల్యాడిల్ వద్ద పనిచేస్తుండగా సాయంత్రం 4.15 గంటలకు జరిగిన ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే చనిపోయారు. షిఫ్ట్ మార్చుకోకుం డా ఉంటే ప్రాణాలతో బతికేవారని కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు. కృష్ణనాగుకు పాప, బాబు ఉన్నారు.

అప్పుడే అప్రమత్తమై ఉంటే..

స్టీల్ ప్లాంటులో భారీ ప్రమాదం జరగనుందనే విషయం విధి ముందే హెచ్చరించిందని ఉద్యోగ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పుడు ప్రమాదం జరిగిన స్టీల్ మెల్టింగ్ షాపు-1 ప్రాంగణంలోనే నాలుగు రోజుల క్రితం ఒక ల్యాడిల్ పేలిందని చెబుతున్నారు. కాకపోతే దాని తీవ్రత తక్కువని సీనియర్ ఉద్యోగి ఒకరు తెలిపారు. చుట్టుపక్కలకు హాట్‌మెటల్ వెదజల్లకుండా ఆ రోజున పైకి ఎగజిమ్మిందని, దానివల్ల ప్రమాదం పెద్దగా జరగలేదని పేర్కొన్నారు.

'రోజూ ఫోన్ చేసేవారు, ఈరోజే...'

బోరుమన్న వెంకటరమణ భార్య జోగమ్మ

విశాఖపట్నం జిల్లా పెదగంట్యాడ మండలం మదీనాబాగ్ సమీపాన గల సత్యారావు కాలనీకి చెందిన నక్కా వెంకట రమణ స్టీల్‌ప్లాంటులోని ఎస్ఎంఎస్ విభాగంలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నారు. సోమవారం ఆయన బి-షిఫ్టు డ్యూటీకి వెళ్లారు. ప్రతిరోజూ డ్యూటీకి వెళ్లిన వెంటనే భార్య జోగమ్మకు ఫోన్ చేస్తారు. కానీ సోమవారం ఫోన్ చేయలేదని, ఇంతలోనే ఆయన చనిపోయిన వార్త చెవిన పడిందని జోగమ్మ ఉక్కు జనరల్ ఆస్పత్రి వద్ద బోరున విలపించింది. ఆమె అపస్మారక స్థితికి చేరుకోవడంతో ఆస్పత్రిలో చేర్చారు. వెంకటరమణకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. మరో మృతుడు భానుకుమార్‌కు మూడేళ్ల క్రితం గాజువాక శ్రీనగర్ ప్రాంతానికి లావణ్యతో వివాహమైంది. ఏడాది వయసున్న కుమారుడు ఉన్నాడు. పెద్దదిక్కును కోల్పోవడంతో భార్య లావణ్యతో పాటు తల్లి వరలక్ష్మి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మరో మృతుడు నక్కరాజు అప్పలరాజుకు భార్య మణి, కుమారుడు దేవివరప్రసాద్, కుమార్తె హేమశ్రీతో పాటు తల్లిదండ్రులు అప్పారావు, అప్పలనరసమ్మ ఉన్నారు.

మృతులు వీరే...

గోల్డ్ కుమార్ (మేనేజర్), జీవీ అప్పారావు (సైడ్ ఆపరేటర్), ప్రభాకరరావు (స్టాండ్ 3 ఆపరేటర్), జి.భానుకుమార్ (షిఫ్ట్ ఇన్‌చార్జి, స్టాండ్-1), కృష్ణ నాగు (స్టాడ్-4 ఆపరేటర్), రమణ (పౌడర్ కలాసీ-కాంట్రాక్ట్ వర్కర్), త్రినాథ్ (స్టాండ్ ఆపరేటర్-కాంట్రాక్టు వర్కర్), ఎన్.అప్పలరాజు(స్టాండ్ ఆపరేటర్-కాంట్రాక్టు వర్కర్), మరో వ్యక్తి.

క్షతగాత్రులు:

పైడిరాజు, రావూరి మల్లికార్జునరావు, పల్లెల శ్రీనివాస్, అర్జున్ అప్పారావు, సత్యానంద్, సూరిబాబు. క్షతగాత్రులను షీలానగర్‌లోని కిమ్స్ ఆస్పత్రి, సెవెన్ హిల్స్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు.

25 లక్షల చొప్పున పరిహారం

మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున యాజమాన్యం పరిహారం ప్రకటించింది. గాయపడిన ఉద్యోగులకు రూ. 10 లక్షల పరిహారం చొప్పున పరిహారం ప్రకటించారు. ఉద్యోగి రిటైర్మెంట్ వరకు క్వార్టర్స్‌లో నివాసం ఉండేందుకు అవకాశం కల్పించారు. పిల్లల చదువులకు ఆర్థిక సహాయం చేస్తారు. మృతుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇస్తామని కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామి తెలిపారు. మృతుల్లో పర్మినెంట్ ఉద్యోగుల కుటుంబాలకు మొత్తంగా రూ. 1.5 కోట్ల వరకు పరిహారం, కాంట్రాక్టు ఉద్యోగులకు రూ. 35 లక్షల వరకు సహాయం అందుతుందని ఆయన వెల్లడించారు.

పొరపాటు ఎక్కడో తేలాల్సి ఉంది

కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస వర్మ

విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ఘోర ప్రమాదం అత్యంత దురదృష్టకరమైన ఘటన అని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'వైజాగ్ స్టీల్ ప్లాంట్ దుర్ఘటన నన్ను తీవ్రంగా కలచివేసింది. స్టీల్ తయారీ ప్రాసట?సలో భాగంగా 1500 డిగ్రీల సెల్సియస్ అత్యధిక ఉష్ణోగ్రతతో కూడిన 150 టన్నుల ద్రవరూప ఉక్కు(హాట్ మెటల్)ను లాడెల్ ద్వారా నంబర్-2 మిషన్ దగ్గరకు తరలిస్తున్న సమయంలో ఈ బ్లాస్ట్ జరిగినట్లు ప్రాథమిక సమాచారం అందింది. ప్రమాదంలో తొమ్మిది మంది కార్మికులు మరణించడం అత్యంత విచారకరం. ప్రమాద సమయంలో పక్క మిషన్ దగ్గర విధుల్లో ఉన్న ఆరుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. క్షతగాత్రులకు అత్యుత్తమ వైద్యం అందించడమే మా మొదటి ప్రాధాన్యత. అవసరమైతే వారిని మెరుగైన వైద్యం కోసం తరలించేందుకు ప్రభుత్వం తరపున ఎయిర్ అంబులెన్స్‌ను సిద్ధం చేశాం. ప్రమాద తీవ్రత దృష్ట్యా కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామి ఈ రాత్రికే విశాఖపట్నం చేరుకున్నారు. తీవ్రమైన వేడి మంటల కారణంగా ప్రస్తుతానికి ప్రమాదం జరిగిన ప్రాంతానికి వెళ్లే పరిస్థితి లేదని అధికారులు తెలిపారు. స్టీల్ తయారీ ప్రాసట?సలో ఎక్కడ పొరపాటు జరిగిందనేది తేలాల్సి ఉంది.' అని స్పష్టం చేశారు. అనంతరం కారులో వైజాగ్ బయలుదేరారు.

# విశాఖ స్టీల్ ప్లాంట్

## ప్రమాదంలో 9కి పెరిగిన మృతుల సంఖ్య..

వివరాలను అక్కడి ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం, సహాయక చర్యలు, భద్రతా ఏర్పాట్లు, క్షతగాత్రులకు అందిస్తున్న వైద్య సదుపాయాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా, గాయపడిన కార్మికులకు సాధ్యమైనంత ఉత్తమ వైద్యం అందించాలని మంత్రి అనిత అధికారులను ఆదేశించారు. ప్రమాదానికి సంబంధించిన సమాచారం, క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలియజేసేందుకు విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఒక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. సహాయం లేదా సమాచారం కోసం ప్రజలు 0891-2590100, 0891-2590102 నంబర్లలో సంప్రదించాలని అధికారులు సూచించారు. ఈ ప్రమాదం స్టీల్ ప్లాంట్ చరిత్రలోనే అత్యంత విషాదకరమైన ఘటనల్లో ఒకటిగా నిలిచింది.

# ఇజ్రాయెల్ పై చర్యలు నిలిపివేస్తున్నాం

కీలక ప్రకటన చేసింది. ఇజ్రాయెల్‌పై చేపట్టిన సైనిక కార్యకలాపాలను ప్రస్తుతానికి నిలిపివేస్తున్నట్లు సోమవారం వెల్లడించింది. ఇరు దేశాల మధ్య ప్రత్యక్ష క్షిపణి దాడులు జరిగిన కొన్ని గంటల్లోనే ఈ కీలక పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. లెబనాన్ రాజధాని బీరుట్‌లోని హిజ్బుల్లా స్థావరంపై ఇజ్రాయెల్ జరిపిన దాడికి ప్రతీకారంగా, ఇరాన్ ఆదివారం రాత్రి ఇజ్రాయెల్‌పై బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. దీనికి ప్రతిగా ఇజ్రాయెల్ కూడా ఇరాన్‌లోని పలు వ్యూహాత్మక లక్ష్యాలపై వైమానిక దాడులు నిర్వహించింది. దీంతో మధ్యప్రాచ్యంలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. అయితే, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జోక్యం చేసుకుని, ఇరు దేశాలు వెంటనే దాడులు ఆపాలని పిలుపునివ్వడంతో ఉద్రిక్తతలు కొంతమేర తగ్గుముఖం పట్టాయి.ఈ దాడులను 'బాధాకరమైన ప్రతిస్పందన'గా అభివర్ణించిన ఇరాన్ సైనిక ప్రధాన కార్యాలయం, ప్రస్తుతానికి తమ ఆపరేషన్లను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. అయితే, భవిష్యత్తులో ఇజ్రాయెల్ ఎలాంటి దుందుడుకు చర్యలకు పాల్పడినా, ముఖ్యంగా దక్షిణ లెబనాన్‌లో దాడులు కొనసాగించినా మరింత తీవ్రమైన ప్రతిచర్యలు తప్పవని హెచ్చరించింది. మరోవైపు ఇజ్రాయెల్ కూడా ఇరాన్‌పై దాడులు నిలిపివేసినట్లు స్పష్టం చేసింది. ఈ పరిణామంతో అంతర్జాతీయ మార్కెట్లు ఊపిరి పీల్చుకున్నాయి. చమురు ధరలు తగ్గగా, స్టాక్ ఫ్యూచర్లు వృద్ధిని నమోదు చేశాయి. గత ఏప్రిల్‌లో కుదిరిన ఒప్పందం తర్వాత ఇరు దేశాల మధ్య ఈ స్థాయిలో ప్రత్యక్ష ఘర్షణ చోటుచేసుకోవడం ఇదే తొలిసారి. ప్రస్తుతం పరిస్థితి అదుపులోకి వచ్చినట్లు కనిపిస్తున్నప్పటికీ, ఇరాన్ విధించిన షరతులతో కూడిన వైఖరి వల్ల మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు ఇంకా పూర్తిగా సద్దుమణగలేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.๐

# ఇది ఇడ్లీ... ఐటీ ఇంజినీర్ కు శశి థరూర్ క్లాస్!

మరోసారి సామాజిక మాధ్యమాల్లో సందడి చేశారు. దక్షిణాది సంప్రదాయ వంటకం ఇడ్లీని తినే విధానంపై ఆయన చేసిన చమత్కారపూరిత వ్యాఖ్య ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. బెంగళూరుకు చెందిన యశ్ రావల్డోసా అనే ప్రొడక్ట్ మేనేజర్, తాను ఇడ్లీలను పిజ్జా ముక్కల్లా కట్ చేసిన ఫొటోను 'ఎక్స్'లో వేదికగా పంచుకున్నారు. తన కటింగ్ నైపుణ్యానికి రేటింగ్ ఇవ్వాలని ఆయన నెటిజన్లను కోరారు. ఈ పోస్ట్‌పై శశిథరూర్ వెంటనే స్పందిస్తూ, సాంకేతికతను, వంటను ముడిపెడుతూ సరదాగా సమాధానమిచ్చారు. "ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ వంటగదిలోకి వెళ్లి డేటాను విభజించడానికి ప్రయత్నిస్తే ఇలాగే ఉంటుంది! దాన్ని 'ఇడ్లీ' అంటారు, 'ఇడ్-స్లైస్' కాదు. ఒకవేళ వారు ఇటాలియన్లు అయ్యుండి, దాన్ని పిజ్జా అని పొరబడితే తప్ప.. ఇడ్లీలను ఇలా ఎవరూ తినరు. (అయితే పిజ్జాపై సాంబార్ వేయడానికి మాత్రం ప్రయత్నించకండి, సరేనా?)" అంటూ థరూర్ పోస్ట్ చేశారు. ఈ సరదా సంభాషణ సోషల్ మీడియాలో వేగంగా వ్యాపించింది. ఇడ్లీలను ఆవిరిపై ఉడికించి సాంబార్, చట్నీతో కలిపి తినడమే సరైన పద్ధతి అని నెటిజన్లు అభిప్రాయపడ్డారు. గతంలో ఇడ్లీని ఎవరో రసగుల్లాతో పోల్చినప్పుడు కూడా శశిథరూర్ ఇలాగే స్పందించారు. ఆ సమయంలో ఆయన ఇడ్లీని "వంటల ప్రపంచంలోని గొప్ప ఇంజినీరింగ్ అద్భుతాలలో ఒకటి" అని వర్ణించారు. సామాజిక, సాంస్కృతిక అంశాలపై తనదైన శైలిలో స్పందించే థరూర్, ఈ పోస్ట్‌తో మరోసారి వార్తల్లో నిలిచారు.๐

# ఫడ్నవీస్ అపాయింట్‌మెంట్‌పై రేవంత్ అబద్ధం చెబుతున్నారు

కార్యాలయమే స్పష్టం చేసిందని తెలిపారు. నెల రోజుల క్రితం ఒక మంత్రి (ఉత్తమ్) అపాయింట్‌మెంట్ కోరారని, కానీ ఇప్పుడు ముఖ్యమంత్రే స్వయంగా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్తర, దక్షిణ భారతదేశం మధ్య విభజన రాజకీయాలకు పాల్పడుతోందని రాంచందర్ రావు విమర్శించారు. అంతర్జాతీయ వేదికలపై భారత్ సాధిస్తున్న పురోగతిని కాంగ్రెస్ పార్టీ జీర్ణించుకోలేకపోతోందని ఆయన వ్యాఖ్యానించారు. అభివృద్ధి పథకాలను కాంగ్రెస్ నేతలు స్వప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా మూసీ నది ప్రక్షాళన, కాళేశ్వరం ప్రాజెక్టు వంటి అంశాలను కూడా ఆయన ప్రస్తావించారు. మూసీ ప్రక్షాళన ప్రాజెక్టు వల్ల ప్రభావితమయ్యే బాధితులకు పునరావాసం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తుచేశారు. తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ మధ్య రాజకీయ పోరు తీవ్రతరమైన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# దేశాన్ని విడదీయొద్దు.. రేవంత్ రెడ్డికి 'ఇండీ' మిత్రపక్షం హితవు!

సువాసనతో ఉంటుంది. కానీ అవన్నీ కలిస్తేనే ఒక అందమైన గుచ్ఛం అవుతుంది" అని దూబే వ్యాఖ్యానించారు. భౌగోళిక, భాషా వ్యత్యాసాలతో సంబంధం లేకుండా ప్రతి రాష్ట్రానికి సమాన గౌరవం దక్కాలని ఆయన స్పష్టం చేశారు. పాకిస్థాన్‌తో యుద్ధం వస్తే మనం ఉత్తర భారతం, దక్షిణ భారతం అని చూసుకోమని దూబే వ్యాఖ్యానించారు. మనమందరం భారతీయులుగానే నిలబడతామని, రేవంత్ రెడ్డి ఈ విషయాన్ని గ్రహించాలని హితవు పలికారు. రేవంత్ కాంగ్రెస్ సీనియర్ నేత అయినప్పటికీ కూటమి భాగస్వామ్య పక్షంగా దేశ సమగ్రత విషయంలో తాము రాజీపడేది లేదని స్పష్టం చేసింది. భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం కాబోవని ఆశిస్తున్నట్లు పేర్కొంది. ఇటీవల బెంగళూరులో జరిగిన ఓ మీడియా సమావేశంలో రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. దేశ ప్రధాని, రాష్ట్రపతి ఇద్దరూ ఉత్తర భారత్‌కు చెందినవారేనని.. దక్షిణాదిని ప్రాతినిధ్యం వహించే బలం బీజేపీకి లేదని ఆరోపించారు. దక్షిణ భారతదేశ ప్రజలు ఈ దేశంలో 'రెండో శ్రేణి పౌరులుగా' బతకడానికి ఇష్టపడరని అనడం చర్చనీయాంశంగా మారింది.

# పరీక్షలంటే తెలియని వారు కూడా బురద జల్లుతున్నారు

పరీక్షలు అంటే ఏమిటో, రిజర్వేషన్లు అంటే ఏమిటో తెలియని వ్యక్తులు డీఎస్సీ నియామకాలపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం సిద్ధాంతంలో నిర్వహించిన 'మీ భూమి - మీ హక్కు' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, వైసీపీపై తీవ్ర విమర్శలు చేశారు. గత పాలకులు జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పి నిరుద్యోగులను దగా చేశారని, తాము అధికారంలోకి వచ్చాక దాదాపు 16 వేల టీచర్ ఉద్యోగాలు ఇచ్చామని గుర్తుచేశారు. ఏం చెప్పాలో తెలియక నేరాలు చేసి, ఎదుటివారిపై దుష్ప్రచారం చేయడమే 'గొడ్డలి పార్టీ' పనిగా పెట్టుకుందని విమర్శించారు. గొడ్డలి పట్టుకునే చేతులకు నాగలి పట్టే రైతులు గుర్తుకురారని, కోడికత్తి డ్రామాలు ఆడేవాళ్లకు వరికోతలు ఎలా తెలుస్తాయని ఎద్దేవా చేశారు. భూ రికార్డుల ప్రక్షాళన.. రాజముద్రతో పాస్‌పుస్తకాలు భూ వివాదాలకు తావులేని గోదావరి జిల్లాల్లో గత పాలకులు చిచ్చుపెట్టి రికార్డులు తారుమారు చేశారని చంద్రబాబు ఆరోపించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరిట ఓ నల్ల చట్టం తెచ్చి ప్రజల భూములను కాజేయాలని చూశారని, ప్రభుత్వ ఆధీనంలో ఉండాల్సిన

## ఎరువులు విచక్షణారహితంగా వాడొద్దు






మహానంది, పల్లె వెలుగు ఎరువులు, పురుగుమందులను విచక్షణారహితంగా వాడొద్దని అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ గీతా శిరీష, డాక్టర్ మాధవి పేర్కొన్నారు. సోమవారం మహానంది మండలంలోని గాజులపల్లె, బసాపురం గ్రామాల్లో మహానంది వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి. జయలక్ష్మి ఆధ్వర్యంలో 'కేత్ బచావో అభియాన్'పై రైతులతో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రైతులు తమ పంట పొలాల్లో వరి గడ్డి, ఇతర వ్యవసాయ వ్యర్థాలను కాల్చివేయడం వల్ల భూమికి మేలు చేసే సూక్ష్మజీవులు నశిస్తాయన్నారు.వ్యవసాయ వ్యర్థాలను భూమిలో కలియదున్నడం ద్వారా అవి సేంద్రియ ఎరువులుగా మారి భూసారాన్ని పెంచుతాయని తెలిపారు.రసాయనిక ఎరువులను భూసార పరీక్షల ఆధారంగా, తక్కువ మోతాదుల్లో మాత్రమే వాడాలన్నారు. విచక్షణారహితంగా ఎరువులు వినియోగించడం వల్ల భూమి సారవంతత తగ్గి, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన భూమిని అందించడం కష్టమవుతుందని తెలిపారు.రైతులకు మట్టి నమూనాలు సేకరించే సరైన విధానాన్ని వివరించారు. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువుల వినియోగం చేపట్టడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి వి. వెంకటేశ్వర్లు, రైతు సేవ కేంద్రం అధికారిని విశ్వద, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## కౌలు రైతులకు కార్డులు జారీ చేయండి:తహశీల్దార్



మహానంది, పల్లె వెలుగు కౌలు రైతులకు వెంటనే కౌలు కార్డులు జారీ చేయాలని మహానంది తాహశీల్దార్ రమాదేవి వీఆర్వోలకు సూచించారు. సోమవారం మహానంది తాహశీల్దార్ కార్యాలయంలో అన్ని గ్రామాల వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ..కౌలు కార్డు కొరకు భూ యజమాని ఆధార్ కార్డు, భూ యజమాని పాసుబుక్, కౌలు రైతు ఫోటో, ఆధార్ కార్డుల జిరాక్సులు తీసుకొని కార్డులు ఇప్పించాలన్నారు. రైతుకు పంటపైన మాత్రమే హక్కు ఉంటుందని, భూమిపైన ఎటువంటి హక్కు ఉండదన్నారు. మండల వ్యవసాయ అధికారి నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ..కౌలు కార్డు ఉంటే వ్యవసాయ శాఖ ద్వారా వచ్చే అన్ని రకాల ప్రయోజనాలు అందుతాయి అన్నారు.కౌలు రైతు కార్డు ఉంటేనే ఈ ఖరీఫ్ సీజన్లో కౌలు రైతుకు యూరియా ఇవ్వడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఏపీఏ ఐఎంఎస్ యాప్ ద్వారా రైతులకు మాత్రమే ఎరువులు పంపిణీ చేయడం జరుగుతుందని, కౌలు రైతులకు ఎరువులు కావాలంటే తప్పనిసరిగా కార్డు ఉండాలన్నారు. కౌలుకు సాగు చేసుకునే రైతులు కౌలు కార్డుల కొరకు సంబంధిత ధ్రువపత్రాలతో గ్రామాల్లోని రైతు సేవా కేంద్ర సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులును సంప్రదించాలన్నారు.కార్యక్రమంలో ఆర్ఐ సుబ్బారావు, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామ సచివాలయాలకు పేర్లు మార్పులు చేయాలి



మహానంది, పల్లె వెలుగు మహానంది మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ సచివాలయ కార్యాలయాల పేర్లను స్వర్ణ గ్రామ సచివాలయాలుగా మార్పు చేయాలని మహానంది మండల జనసేన నాయకులు కోరారు. సోమవారం మహానందిలో డిప్యూటీ ఎంపీడీవోలు సంజీవ కుమార్,భార్గవి లతకు వినతి పత్రం అందజేశారు. జనసేన నాయకులు మాట్లాడుతూ..కూటమి ప్రభుత్వం సచివాలయాల పేరును మార్పు చేయాలంటూ అధికారికంగా జీవో విడుదల చేసిన మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పేరు మార్పు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే స్పందించి గ్రామ సచివాలయాల పేర్లను స్వర్ణ గ్రామ సచివాలయాలుగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కాకర్ల శివ, వరప్రసాద్, ప్రసాదు, మహేష్ ,చందు చింతకుంట్ల ప్రసాదు పాల్గొన్నారు.

## సంత జూటూరులో వేలం పాటలు



బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూన్ 8: బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న సంత జూటూరు గ్రామంలో సోమవారం దేవాలయ భూములకు సంబంధించి బహిరంగంగా వేలం పాటలను నిర్వహించారు. శ్రీ చెన్నకేశవ, ఆంజనేయస్వామి దేవస్థానం లకు సంబంధించి 46.96 ఎకరాల భూమికి వేలంపాటలను నిర్వహించారు. గత సంవత్సరం 7,70,000 రూపాయలకు వేలం పాటలు నిర్వహించగా ఈ సంవత్సరం 780 వేల రూపాయలకు వేలంపాట జరిగింది. పదివేల రూపాయల ఆదాయం మాత్రమే లభించింది. ఈ వేలం పాటలలో పర్యవేక్షణ అధికారిగా నంద్యాల డివిజన్ తనిఖీ అధికారి టి హరిప్రసాద్ నాగప్రసాద్ తో పాటు చైర్మన్ నాగ శ్రీనివాసరెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకులు గౌతం సుబ్రహ్మణ్య కుమార్ శర్మ, పోలీసు సిబ్బంది గ్రామ పెద్దలు రైతులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య హక్కుల్ని హరించే బిజెపి ఆర్ఎస్ఎస్ .

**ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద సిపిఐ నాయకులపై ఆర్ ఎస్ ఎస్ గుండాల దాడులను ఖండించండి..**

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె. రామాంజనేయులు.**



పల్లె వెలుగు నంద్యాల రూరల్. ఢిల్లీలో జంతర్ మంతర్ వద్దా కాక్రోచ్ జనతా ( సిజేపి) జరుగు నిరసనకు సిపిఐ పార్టీ జాతీయ కార్యదర్శి అనీ రాజా ఎన్ ఎఫ్ ఐ డబ్ల్యు జాతీయ కార్యదర్శి నిషా సిద్దు ఏఐ వైఎఫ్ ఏఐఎస్ఎఫ్ జాతీయ నాయకులు సంఘీభావం తెలపడానికి వెళితే ఆర్ఎస్ఎస్ మూకలు అనీ రాజాపై అక్కడున్న సిపిఐ నాయకులు పై దాడులకు పాల్పడ్డారు. దీన్ని తీవ్రంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే రామాంజనేయులు. ఖండించారు.

నంద్యాల పట్టణంలో విలేకరుల సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే రామాంజనేయులు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె రామాంజనేయులు మాట్లాడుతూ

దేశంలో బిజెపి అనుబంధం సంఘాలైన ఆర్ఎస్ఎస్ మూకలు పై కేసులు పెట్టి వారిని జైలు పంపించాలని. కాక్రోచ్ జనతా పార్టీ నీట్ ప్రశ్న పత్రాలు లీకైన దానికి బాధ్యత వహించి కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా చేయాలని ప్రజాస్వామ్య బద్దంగా నిరసన తెలిపితే బిజెపి ప్రభుత్వం ఆర్ ఎస్ ఎస్ గుండాలతో ఇటువంటి దాడులకు పాల్పడుతూ రాజ్యాంగం ఇచ్చే హక్కులను ఉల్లంఘిస్తూ స్వేచ్ఛ సమానత్వాన్ని అనగ దొక్కుతూ ప్రశ్నించేవారి ని గొంతు నొక్కి ఉపా చట్టం క్రింద కేసులు పెడుతూ జైలు పంపిస్తున్నారని విమర్శించారు. బిజెపి దాని అనుబంధ ఆర్ ఎస్ ఎస్ గుండాలు సిపిఐ నాయకులు గొంతును నొక్కాలనుకోవడం మీ తరంకాదని . 2014లో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సంవత్సరానికి రెండు కోట్లు ఉద్యోగాలు ఇస్తానని నేడు ఉద్యోగాలు ఎక్కడివి అని అడిగితే వారిపై దాడి చేయడం దురదృష్టంకరమని ఈ దాడిని సిపిఐ నంద్యాల జిల్లా సమితి తీవ్రంగా ఖండిస్తుందన్నారు.

# రెండేళ్లలో కర్నూలు జిల్లాకు

# భారీగా పెట్టుబడులు: మంత్రి టీజీ భరత్ గుప్తా

- **రిలయన్స్, జైరాజ్ ఇస్పాత్ కంపెనీలతో యువతకు విస్తృతంగా ఉద్యోగావకాశాలు**
- **రూ.6 వేల కోట్లకు చేరిన రిలయన్స్ ప్రాజెక్టు; మరో రూ.3 వేల కోట్ల పెట్టుబడికి ముందడుగు**
- **తెలగ కాపు బలిజ సేవా సంఘం ప్రతిభ పురస్కారాల ప్రదానోత్సవంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి**





పల్లె వెలుగు కర్నూలు బ్యూరో రాబోయే రెండేళ్లలో కర్నూలు జిల్లా పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందబోతోందని, జిల్లాకు భారీగా పెట్టుబడులు రానున్నాయని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ గుప్తా అన్నారు. కర్నూలు నగరంలోని బి.క్యాంపులో గల కాపు భవనంలో 'కర్నూలు నగర తెలగ కాపు బలిజ సేవా సంఘం' ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పురస్కారాల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో ప్రతిభ కనబరిచిన పలువురికి మంత్రి చేతుల మీదుగా పురస్కారాలను అందజేశారు. అనంతరం మంత్రి టీజీ భరత్ గుప్తా మాట్లాడుతూ.. గత ప్రభుత్వ నిర్వాకం వల్ల వెనుకబడిన ఓర్వకల్లు ప్రాంతానికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో పెట్టుబడులను ఆకర్షించామని స్పష్టం చేశారు.

"ఓర్వకల్లులో మొదట రూ.2,500 కోట్లుగా భావించిన రిలయన్స్ ప్రాజెక్టు పెట్టుబడి.. ఇప్పుడు రూ.6 వేల కోట్లకు దాటింది. దీని ద్వారా స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయి. అంతేకాకుండా, ఓర్వకల్లులో మరో రూ.3 వేల కోట్ల విలువైన ప్రాజెక్టును చేపట్టేందుకు సైతం రిలయన్స్ సంస్థ ముందుకు వచ్చింది."

-- టీజీ భరత్ గుప్తా, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి

**గత ప్రభుత్వ నిర్లక్ష్యంపై ధ్వజం..**

గత వైసిపి ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో ఓర్వకల్లు పారిశ్రామిక ప్రాంతానికి కనీసం వాటర్ లైన్ కూడా తీసుకురాలేకపోయిందని మంత్రి విమర్శించారు. తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే నీటి వసతి కల్పించే పనులను వేగవంతం చేశామన్నారు. గత ప్రభుత్వ వేధింపుల వల్ల జైరాజ్ ఇస్పాత్ స్టీల్ కంపెనీ తీవ్ర ఇబ్బందులు పడిందని, కోట్లాది రూపాయల నష్టాన్ని చవిచూసిందని గుర్తు చేశారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై ఉన్న నమ్మకంతో రూ.6 వేల కోట్లతో జైరాజ్ ఇస్పాత్ కంపెనీని మరింత విస్తరించేందుకు యాజమాన్యం ముందుకు వచ్చిందని ఆయన వెల్లడించారు.

**20 లక్షల ఉద్యోగాలే లక్ష్యం..**

రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ నిరంతరం సమీక్షలు జరుపుతున్నారని మంత్రి తెలిపారు. యువత తమ నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి ఇంజనీరింగ్ కళాశాలలతో మాట్లాడుతున్నామని, ప్రభుత్వం నిర్వహించే జాబ్ మేళాలను యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తమ కుటుంబం ఎటువంటి అవినీతి మచ్చ లేకుండా రాజకీయాలు చేస్తోందని.. మంచి చేసే నాయకుడెవరో, కేవలం మాటలు చెప్పే వారెవరో కర్నూలు ప్రజలు గమనించాలని కోరారు. నగరంలోని ప్రతి వార్డులో పర్యటిస్తూ ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఘనంగా కార్యక్రమం.. ఈ కార్యక్రమంలో కాపు నాడు రాష్ట్ర అధ్యక్షుడు ఆర్జా రామకృష్ణ, వార్డు ఇంచార్జి శ్రీధర్, బొందిలి కార్పొరేషన్ చైర్మన్ విక్రమ్ సింగ్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు సోమిశెట్టి నవీన్, బలిజ సంఘం నాయకులు సోమశేఖర్, స్వామి రెడ్డి, విజయ భాస్కర్, సాంబ శివ, ఆదర్శ అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా సమగ్రాభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి: ఇన్‌చార్జి మంత్రి పయ్యావుల కేశవ్

**- హాజరైన మంత్రులు ఎన్.ఎం.డి. ఫరూక్, బీసీ జనార్ధన్ రెడ్డి, కలెక్టర్ రాజకుమారి మరియు ప్రజాప్రతినిధులు**

- **నంద్యాల జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశంలో దిశానిర్దేశం**
- **వ్యవసాయం, జలవనరులు, ఓటర్ల సవరణ తదితర కీలక అంశాలపై సుదీర్ఘ సమీక్ష**



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో నంద్యాల జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు పరస్పర సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని రాష్ట్ర ఆర్థిక, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పయ్యావుల కేశవ్ పిలుపునిచ్చారు. సోమవారం నంద్యాల జిల్లా చాపిరేవుల గ్రామ పరిధిలోని ఎస్.ఆర్ (రా=) కళ్యాణ మండపంలో జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశం (డిఆర్సి) నిర్వహించారు. ఇన్‌చార్జి మంత్రి పయ్యావుల కేశవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లాకు సంబంధించిన పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యంగా వ్యవసాయం, ఉద్యానవన శాఖ, గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్), పబ్లిక్ హెల్త్, జలవనరుల శాఖ, అటవీ శాఖల పనితీరుతో పాటు ప్రత్యేక ఓటర్ల సమగ్ర సవరణ తదితర అంశాలపై మంత్రి శాఖల వారీగా సమీక్ష జరిపారు. జిల్లాలో పెండింగ్ పనులను వేగవంతం చేయాలని, ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు సకాలంలో అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రజాప్రతినిధులు, అధికారుల భారీ హాజరు: ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్, రోడ్లు-భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా పాల్గొన్నారు. అలాగే పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యే, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి గౌరు చరిత రెడ్డి, ఎమ్మెల్యేలు భూమా అఖిలప్రియ, గిత్త జయసూర్య, బుడ్డా రాజశేఖర్ రెడ్డి, సీనియర్ నాయకులు గౌరు వెంకటరెడ్డి, స్థానిక ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.



వారితో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్, నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కమ్మరి పార్వతమ్మ, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. పార్టీ శ్రేణుల నుంచి క్లస్టర్-11 ఇన్‌చార్జి జనార్ధన్ ఆచారి, 37వ వార్డు ఇన్‌చార్జి సుతారు రాఘవేంద్ర, మరియు వివిధ యూనిట్, బూత్ ఇన్‌చార్జిలు తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

# అర్హులైన నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని వీఆర్వో రాము నాయక్ కి వినతిపత్రం.





పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల పట్టణంలో హర్హులైన నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని డిఆర్ఓ రామ్ నాయక్ కి అఖిల పక్షాల ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చినట్లు సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ తెలిపారు.

అనంతరం అఖిలపక్ష నాయకులు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్, సిపిఐ నంద్యాల పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ వైయస్సార్ సి పి నాయకులు సాయిరాం రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మస్తాన్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు రాంబాబు, ముస్లిం జేఏసీ నాయకులు ఆబులేష్ మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో ఇల్లు లేని నిరుపేదలు ఒక్కొక్క ఇంట్లో రెండు మూడు సంసారాలు చేసుకుంటూ జీవిస్తున్నారు. అదేవిధంగా అద్దె ఇండ్లలో ఉంటూ కూలి నాలి చేసుకున్న డబ్బులతో ఇంటి అద్దెలు కట్టుకోలేక నిత్యావసర సరుకులు కొని తినలేక అనేక ఇబ్బందులకు గురి అవుతున్నారు .

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నంద్యాల పట్టణంలో నివాసానికి అనువైన స్థలములో రెండు సెంట్లు స్థలం ఇవ్వాలని ఈరోజు అఖిలపక్షాల ఆధ్వర్యంలో కలెక్టర్ ఆఫీసులో డిఆర్ఓ కి వినతి పత్రం ఇవ్వడం జరిగిందని అన్నారు .

ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి లక్ష్మీదేవి , మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి సుశీలమ్మ, ఏఐటీయూసీ పట్టణ అధ్యక్ష కార్యదర్శు లు డి శ్రీనివాసులు ధనుంజయ్ , మహిళా నాయకురాలు సరోజమ్మ, సునీత , పాల్గొన్నారు .

# కూటమి ప్రభుత్వ రెండేళ్ల విజయోత్సవ వేడుకల్లో పాల్గొన్న మంత్రి ఎన్ఎండి ఫరూక్ & జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరోజ్."





పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల మండలం చాపిరేవుల గ్రామంలోని ఎస్ఆర్ ఫంక్షన్ హాలులో నిర్వహించిన తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్ మరియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ ఎం డి ఫిరోజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం విజయవంతంగా రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో కేక్ కట్ చేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత సమర్థవంతంగా తీసుకెళ్లాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అలాగే పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ, ప్రభుత్వ విజయాలను ప్రజలకు చేరవేసే అంశాలపై విస్తృతంగా చర్చించారు. కూటమి ప్రభుత్వ ప్రజా సంక్షేమ పాలనను ప్రతి ఇంటికీ చేరవేసి, పార్టీని మరింత బలోపేతం చేయాలని సమావేశంలో నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ గారు, మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి , జోనల్ కోఆర్డినేటర్ పి శ్రీనివాసులు రెడ్డి ,పాణ్యం ఎమ్మెల్యే మరియు టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరితారెడ్డి , శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి , నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య , మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ తో పాటు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# మీడియా రంగం దిగ్గజం రామోజీరావు

**ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి**





ఎమ్మిగనూరు పల్లె వెలుగు జూన్ 8 ఎమ్మిగనూరు పట్టణంలోని ఆర్ ఓ బి గెస్ట్ హౌస్ నందు రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించిన ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి , ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీడియా దిగ్గజం రామోజీరావు యొక్క 2 వర్ధంతి సందర్భంగా కూటమి ప్రభుత్వం ఈరోజు ఎమ్మిగనూరు నియోజకవర్గంలో మేమందరం కూడా శతకోటి నివాళులు అర్పిస్తున్నాం. ఈరోజు ఒక వ్యాపారవేత్త, ఉష కిరణ్ మూవీస్ కావచ్చు, మార్గదర్శి, ఈ టీవీ చానల్, పత్రిక రంగంలో, ఒక మీడియా దిగ్గజం ఉంటూ సామాన్య రైతు కుటుంబం లో ఉన్నట్లు వంటి మహానుభావుడు, కాష్ట పడితే ఒక డిసిప్లెన్ ఉన్నట్లు వంటి తన జీవితంలో ఏరకంగా, ఏ స్థాయిలో ఒక వ్యక్తి ఎదుగుతారు అనే దానికి నిదర్శనం ఆ మహానుభావుడు రామోజీరావు రామోజీరావు ఒక వ్యక్తిగా, ఒక వ్యవస్థ, ఈరోజు మీకు చూసినప్పుడు ఒక పదం లో చెప్పాలి అంటే రామోజీరావు గురించి ఏదైతే వారు ఉపాధి అన్నప్పుడు క్యాప్టలిస్ట్ గా, అదే రకంగా ఒక ఉద్యోగస్తుల సంబందిచినప్పుడు సోషలిస్ట్ గా, ప్రత్యర్థులకు మావోలిస్ట్ గా, అదే విధంగా ఉన్నట్లు వంటి ప్రతి ఆలోచనలో కూడా ప్రజలకు సంబంధించిన వరకు వారు హ్యూమనిస్ట్ గా, వారి రాతలు మాత్రం కమ్యూనిస్ట్ గా, ఈరకంగా ఆ వ్యక్తి యొక్క ఆలోచన విధానాన్ని తెలుగు ప్రజల యొక్క ఆలోచనని, పత్రిక రూపంగా రూపకల్పణంగా కానీ వారు అనేక విధాలుగా ఎన్ని ఇబ్బందులు పెట్టిన, ఎన్ని కష్టాలు గురిచేసిన కూడా ప్రతి ఒక్కరికి కూడా ఈరోజు వారు ఆదర్శనంగా నిలబడుతూ, రామోజీరావు ఫిల్మ్ సిటీ లాంటి ఒక గొప్ప నిర్మాణాన్ని చూస్తే ప్రపంచంలో దాదాపుగా అంత పెద్ద సిటీ లేకున్నా ఏరకంగా చూసిన పత్రిక రంగంలో కానీ, వ్యాపార రంగంలో కానీ, ఫైనాన్స్ రంగంలో కానీ, ఉష మూవీస్ వంటి ఒక గొప్ప ఆ బ్రాండ్ చూడగానే రామోజీరావు గుర్తించే పరిస్థితి, ఈరోజు వారి దీపం వెలగకు పోయిన వారి ఒక్క ఆలోచన స్ఫూర్తి, మన అందరి గుండెల్లో ఈరోజు కూడా శాశ్వతంగా ఉండి ఆ మహానుభావుడికి ఈరోజు భౌతికంగా లేకపోయినా కూడా వారు చూపించన దారిలో మేము మేమందరం నడిచే విధంగా ముందుకు పోతూ మరోక్కసారి రామోజీరావు కి, ఈుజ, వారి కుటుంబ సభ్యులకు కూడా ప్రగాఢ సానుభూతి , వారికి ఘన నివాళు లు అర్పించారు.

ఈకార్యక్రమంలో మండల మరియు పట్టణ నాయకులు, కార్యాకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# అంధకారంలో గజ్జహల్లి.. పట్టించుకోని అధికారులు



హోళగుంద పల్లె వెలుగు జూన్ 08 హొళగుంద మండలంలోని గజ్జహల్లి గ్రామంలో వీధి దీపాలు పనిచేయకపోవడంతో రాత్రి వేళల్లో గ్రామం అంధకారంలో మునిగిపోతోందని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన వీధులు, కాలనీల్లో లైట్లు వెలగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, విద్యార్థులు రాత్రి సమయంలో బయటకు వెళ్లాలంటే భయాందోళనకు గురవుతున్నారని, వీధి కుక్కల బెడద కూడా పెరిగిందని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారులకు, గ్రామ పంచాయతీ సిబ్బందికి తెలియజేసినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. వెంటనే గ్రామంలో పనిచేయని వీధి దీపాలను మరమ్మతు చేసి, ప్రజలకు తగిన వెలుతురు సౌకర్యం కల్పించాలని వారు అధికారులను కోరుతున్నారు.

# తొలగించిన మెడికల్ శానిటేషన్ కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోకపోతే ఉద్యమాలు ఉధృతం చేస్తాం-ఏఐటియుసి.

**ఏఐటియుసి నంద్యాల జిల్లా కార్యదర్శి పి. సుంకయ్య.**





పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. 50 సంవత్సరాలు పూర్తి అయ్యాయని నంద్యాల ప్రభుత్వ హాస్పిటల్ లో తొలగించిన 13 మంది మెడికల్ శానిటేషన్ కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని,138 జీవో ప్రకారం 18,600 కనీసం వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని,పద్మావతి మెడికల్ ఏజెన్సీ ని రద్దు చేయాలనీ డిమాండ్ చేస్తూ కార్మికులతో కల్సి ఏఐటియుసి ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, ప్రజా సమస్య పరిస్కారం వేదికలో వినతిపత్రం ఇవ్వడం జరిగిందని ఏఐటియుసి జిల్లా కార్యదర్శి సుంకయ్య, ఏఐటియుసి నంద్యాల పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు డి. శ్రీనివాసులు, ధనుంజయ్, డిప్యూటీ కార్యదర్శి భూమని శ్రీనువాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫకృద్దీన్,ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీదేవి,మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు తులషమ్మ,తొలగించబడిన కార్మికులు సులోచన, రమణమ్మ, రాజమ్మ, సునీత, సరస్వతి, వెంకటేశ్వరమ్మ, నాగేంద్రమ్మ, లక్ష్మి నరసమ్మ, హరి ప్రియా, లక్ష్మీదేవి, వెంకటలక్ష్మమ్మ లు పాల్గొన్నారు.

# ప్రభుత్వానికి రెండేళ్ల కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి జిల్లా ఇన్చార్జ్ మంత్రి పయ్యవుల కేశవ్.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల మండలం చాపరేవుల గ్రామంలోనీ ఓ ఫంక్షన్ హాల్లో ప్రజా ప్రభుత్వానికి రెండుళ్ళ కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి జిల్లా ఇంచార్జ్ మంత్రి పయ్యావుల కేశవ్ హాజరయ్యారు. అనంతరం ఆర్ ఒ బి గెస్ట్ హౌస్ లో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి ,జిల్లా ఇంచార్జ్ మంత్రి పయ్యావుల కేశవ్ ను కలిసిన ఉమ్మడి కర్నూలు జిల్లా కో ఆర్డినేటర్ చింత సురేష్ బాబు ,నంద్యాల జనసేన సమన్వయకర్త పిడతల సుధాకర్,రాష్ట్ర శాలివాహన డైరెక్టర్ సుబ్బయ్య,మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పబ్బతి రవి, పాణ్యం మండల అధ్యక్షులు జగదీష్ , జనసేన సాధక్ సురేష్ చౌదరి, రాయలసీమ జోన్ కమిటీ మెంబర్ సందీప్ ,జనసేన నాయకులు రాచమడుగు చందు,సుందర్ బ్రదర్స్ , సుధామోహనరెడ్డి తదితరులు హాజరయ్యారు. ఉమ్మడి కర్నూలు జిల్లా లో ఉండే పలు అభివృద్ధి కార్యక్రమాలపై జనసేన నాయకులు చర్చించారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థి విజయాలకు కృషి చేస్తామని ప్రభుత్వం పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అత్యధిక మెజారిటీతో మున్సిపాలిటీలు కైవసం చేసుకుంటామని తెలియజేశారు.

# మృతి చెందిన విఆర్ఓ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



దొర్నిపాడు జూన్ 8 పల్లె వెలుగు న్యూస్ ప్రభుత్వ కార్యాలయంలో పని భారం ,ఒత్తిడి వల్ల ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన మహమ్మద్ హుస్సేన్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలనిమండల సర్వేల సంఘం,వీఆర్వోల సంఘం అధ్యక్షుడు సాంబశివుడు కోరుతూ తాసిల్దార్ సుభద్రకు వినతి పత్రం అందజేశారు తాసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తూ మృతి చెందిన మహమ్మద్ హుస్సేన్ ఆత్మకు శాంతి జరగాలని ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలియజేశారు,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లా వీఆర్వోల అసోసియేషన్ ఆదేశాల మేరకు మహమ్మద్ హుస్సేన్ మరణానికి కారణమైన పని భారం ఒత్తిడిని తగ్గించాలనినిరసన వ్యక్తం చేస్తున్నట్లు ఆయనతెలిపారు,ఈ కార్యక్రమంలో వీఆర్వోలు సర్వేలు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు

# ప్రధాన రహదారుల పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి : కమిషనర్ చల్లా ఓబులేసు



పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : కర్నూలు నగరంలో నిత్యం జనరద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యమివ్వాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు సూచించారు. సోమవారం ఆయన సుంకేసుల రోడ్డు, సంతోష్‌నగర్, వెంకటరమణ కాలనీ, బళ్లారి చౌరస్తా, చెన్నమ్మ సర్కిల్, కృష్ణానగర్, గుత్తి పెట్రోల్ బంక్, షరీన్‌నగర్, వై జంక్షన్, అశోక్‌నగర్, చిదంబరరావు వీధి తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అదేవిధంగా పరిమళనగర్ అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రధాన రహదారులు, నదీ తీర ప్రాంతాల్లో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రజా సమస్యలను సమన్వయంతో పరిష్కరించాలని సూచించారు. అనంతరం ఎన్ఆర్ పేటలోని నగరపాలక పాత కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ ఏడాది ఆఖరుకు పనులు పూర్తి చేయాలని గుత్తేదారుడికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కుర్మయ్య, శివశంకర్, ఏ. శ్రీనివాసులు, ఎంజల్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## యూనివర్సిటీ ఉద్యోగ దరఖాస్తుల గడువు పెంచాలి

**మాల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాసరపు వెంకటేష్**



పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో ప్రకటించిన ఉద్యోగ నియామకాల దరఖాస్తుల గడువును మరో వారం రోజుల పాటు పొడిగించాలని మాల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాసరపు వెంకటేష్ ప్రభుత్వాన్ని కోరారు. మారుమూల గ్రామాల్లోని నిరుద్యోగ యువత ఇంటర్నెట్ సమస్యలతో పాటు కుల, ఆదాయం, నివాసం, విద్యార్హతలు తదితర ధ్రువీకరణ పత్రాలను సకాలంలో పొందలేక దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కోల్పోతున్నారని పేర్కొన్నారు. వేలాది మంది యువత భవిష్యత్తుకు ఈ నియామకాలు కీలకమని, అర్హులైన అభ్యర్థులు ఎవరూ నష్టపోకుండా మానవతా దృక్పథంతో దరఖాస్తుల గడువును మరో వారం పొడిగించాలని ముఖ్యమంత్రిని విజ్ఞప్తి చేశారు. ప్రతి అర్హ నిరుద్యోగ యువకుడు, యువతి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రభుత్వం తక్షణమే సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు.

## సమస్యల పరిష్కారంలో జాప్యం తగదు

- నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు
- 'ప్రజా ఫిర్యాదుల' స్వీకరణకు 17 అర్జీలు



పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : నగర ప్రజల నుంచి వివిధ రూపాల్లో అందుతున్న అర్జీల పరిష్కారంలో జాప్యం తగదని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అధికారులకు సూచించారు. ప్రజల ఫిర్యాదుల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్య ప్రాంతాన్ని సందర్శించినప్పుడు సమస్యను పూర్తిగా గ్రహించి, పరిష్కారం కనుగొనడం సులభమవుతుందన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చే అర్జీలను నిర్దేశిత గడువులోపు శాశ్వతంగా పరిష్కరించి, ప్రజల సంతృప్తి స్థాయిని పెంచుదామని కమిషనర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎస్‌బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 17 అర్జీలు వచ్చాయి. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ ఒ ఆర్వో జునైద్, ఎస్ఈ రమణమూర్తి, ఇంచార్జీ సిటి ప్లానర్ వై.వి. వెంకటరమణ, ఆర్వో స్వర్ణలత, వాజిద్, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, తదితరులు పాల్గొన్నారు.

## యోగాను జీవనశైలిలో భాగం చేసుకోవాలి





మహానంది, పల్లె వెలుగు యోగాను జీవనశైలిలో భాగంగా చేసుకుంటే ఆరోగ్యమే మహాభాగ్యమవుతుందని ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మహానంది పుణ్యక్షేత్రంలోని పోచా బ్రహ్మానంద రెడ్డి విశ్రాంతి భవనంలో యోగాంధ్రా కార్యక్రమంలో భాగంగా శిక్షణ తరగతులను ఈవో ప్రారంభించారు. ఈవో మాట్లాడుతూ.. యోగా కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదని, అది మానసిక ప్రశాంతతకు, ఆధ్యాత్మిక వికాసానికి తోడ్పడే ఒక జీవన విధానమన్నారు. ఆధునిక జీవనశైలిలో ఒత్తిడి, ఆందోళనలు పెరిగిపోతున్న తరుణంలో, యోగా వాటిని అధిగమించడానికి ఒక శక్తివంతమైన సాధనంగా ఉపయోగపడుతుందని అన్నారు. యోగాను క్రమం తప్పకుండా ఆచరిస్తే భవిష్యత్తులో ఆరోగ్యకరమైన జీవితాన్ని పొందవచ్చు అన్నారు. నేటి నుంచి జూన్ 21వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 6 గంటల నుంచి 8 వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## పోలీస్ "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి 123 ఫిర్యాదులు..

**-చట్ట పరిదిలో న్యాయం చేస్తామని భరోసా. -జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్.**




పల్లె వెలుగు నంద్యాల క్రైమ్. నంద్యాల జిల్లా బొమ్మలసత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ( 08-06-2026 ) నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ ఫిర్యాదిదారుల నుంచి 123 ఫిర్యాదులను స్వీకరించారు.

ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో జిల్లా ఎస్పీ స్వయంగా మాట్లాడి ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని, నిర్ణీత గడువు లోపల ఫిర్యాదులను పరిష్కరించాలని, ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని,ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని, పరిష్కరించిన ఫిర్యాదుల వివరాలను జిల్లా ప్రధాన కార్యాలయానికి అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సాగునీటి ప్రాజెక్టుల క్యాలెండర్

**లిస్టులో ఆర్డీఎస్ పేరు లేకపోవడం బాధాకరం**







ఎమ్మిగనూరు పల్లె వెలుగు జూన్ 8 మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ప్రాధాన్యత లిస్టులో ఆర్డీఎస్ పేరు ను చేర్చి నిధులు సాధించాలి. ఈ ప్రాంతానికి అన్యాయం జరుగుతుంటే ఎమ్మిగనూరు,మంత్రాలయం ఎమ్మెల్యేలు నోరు విప్పరా...ప్రభుత్వం ప్రకటించిన ఇరిగేషన్ ప్రాజెక్టుల క్యాలెండర్ జాబితాలో ఆర్డీఎస్ పేరుతక్షణమే చేర్చి నిధులు కేటాయించాలి.... ఎమ్మిగనూరు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వం పెండింగ్ లో ఉన్న 30 సాగునీటి ప్రాజెక్టులను నిధులు కేటాయించి ప్రాధాన్యత కార్యక్రమంలో పూర్తి చేస్తామని ఇరిగేషన్ క్యాలెండర్ ప్రకటించిందని ఈ జాబితాలో ఆర్డీఎస్ పేరు లేకపోవడం బాధాకరమని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జిల్లా కార్యవర్గ సభ్యులు జి రంగన్న, రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి పంపన్న గౌడ్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్ తెలిపారు. వారు సోమవారం ఎమ్మిగనూరు సిపిఐ కార్యాలయంలో మంత్రాలయం,ఎమ్మిగనూరు నియోజకవర్గల సిపిఐ, రైతు సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది.

ఈ సందర్భంగా జి.రంగన్న పి.పంపనగౌడ్, భాస్కర్ యాదవులు మాట్లాడుతూ

2019 ఫిబ్రవరి 21న ఆర్డీఎస్, గుండ్రేవుల,వేదవతి ప్రాజెక్ట్ పనులు ప్రారంభించడానికి అప్పటి టిడిపి ప్రభుత్వం 2,890 కోట్ల రూపాయలను కేటాయిస్తూ జీవో నెంబర్ 153 జారీ చేసి, వర్చువల్ ద్వారా ప్రారంభించడం జరిగిందని, కాంట్రాక్టర్ క్షేత్రస్థాయిలో కొంత పని కూడా చేశారని వారు గుర్తు చేశారు.

2019 ఎన్నికల్లో టిడిపి అధికారం కోల్పోయి వైసీపీ ప్రభుత్వం రావడం జరిగిందని అయితే 5 సంవత్సరాల కాలంలో ఈ ప్రాజెక్టులకు నిర్మాణానికి కనీసం పిడుకుడు మట్టి కుడా వెయ్యలేదని వారు తెలిపారు.

2023 ఎన్నికల సందర్భంగా చంద్రబాబు నాయుడు,లోకేష్ కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలో పాదయాత్ర సందర్భంగా ఈ ప్రాంతంలో కరువును పారద్రోలుతామని ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే మా ప్రభుత్వ లక్ష్యమని అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ ప్రాజెక్టుల పనులను ప్రారంభిస్తామని ఎన్నికల సందర్భంగా తండ్రి కొడుకులు ఇద్దరు కుడా హామీ ఇవ్వడం జరిగిందని వారు గుర్తు చేశారు.

అధికారంలోకి వచ్చి 2 సంవత్సరంలో పూర్తయిన =ఇూ ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభించకపోవడం దురదృష్టకరమని

చంద్రబాబు నాయుడు లోకేష్ విధానం తీరు ఏరు దాటిన వరకు ఓడు మల్లన్న ఏరు దాటిన తర్వాత బోడి మల్లన్న అన్న చందంగా ఉందని అధికారం లేనప్పుడు ఒక మాట అధికారం వచ్చిన తర్వాత మరో ఈ విధంగా వ్యవహరించడం బాధాకరం.

ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణం పూర్తయితే 4 టిఎంసిలు ఉపయోగించుకోవడం ద్వారా 40 వేల ఎకరాలకు రెండు పంటలు పండించివచ్చని , ఎమ్మిగనూరు మున్సిపాలిటీ తో పాటు వందల గ్రామాలకు తాగునీరు గా ఉపయోగపడుతుందని,కోసిగి, కోటేకల్, పెద్దకడుబూర్, చిన్నమరివీడు, ప్రాంతాలలో రిజర్వాయర్లను ఏర్పాటు చేసి వలసలు కరువుని నివారించి వచ్చని, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఇరిగేషన్ క్యాలెండర్ జాబితాలో ఆర్డీఎస్ ప్రాజెక్టును చేర్చాలని వారు డిమాండ్ చేశారు. ఈనెల 3 తేదీన సిపిఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ నేతృత్వంలో సిపిఐ జిల్లా నాయకత్వం రాష్ట్ర సచివాలయంలో నీటి ప్రాజెక్టుల శాఖ మంత్రివర్యులు నిమ్మల రామానాయుడు ను కలిసి జిల్లాలో కరువు,వలసలు నివారించాలంటే తక్షణమే ఆర్డిఎస్, వేదవతి, గుండ్రేవుల, ప్రాజెక్టులను నిర్మించాలని వినతి పత్రం ఇవ్వడం జరిగిందని వారు తెలిపారు. నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 30 నీటిపారుదల ప్రాజెక్టును ఎంపిక చేయడం జరిగింది. అందులో కర్నూలు జిల్లా నుండి వేదవతి ప్రాజెక్ట్ మాత్రమే ఎంపిక చేశామని చెప్పడం జరిగిందని వారు గుర్తు చేశారు. ఎమ్మనూరు,మంత్రాలయం నియోజకవర్గం అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణాన్ని తక్షణమే పూర్తి చేస్తాం నిధులు వెచ్చిస్తాం అంటూ ప్రజలను అబద్దాలతో పక్కదారి పట్టిస్తున్నారని, ప్రభుత్వం ప్రకటించిన ప్రాధాన్యత జాబితాలో ఆర్డిఎస్ పేరు లేకపోవడం దుర్మార్గమని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

కాబట్టి ఇప్పటికైనా రెండు నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు ప్రభుత్వం పైన ఒత్తిడి తెచ్చి ఇరిగేషన్ ప్రాజెక్టుల క్యాలెండర్ జాబితాలో 30 నీటి ప్రాజెక్టులలో ఆర్డీఎస్ పేరును చేర్చి నిధులు కేటాయించి తక్షణమే పనులను ప్రారంభించాలని లేనిపక్షంలో రెండు నియోజకవర్గాలలో సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటానికి రూపకల్పన చేస్తామని, ఇక్కడ ప్రజల ఓట్లతో గెలిచి ఈ ప్రాంత అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తే ఈ ప్రాంతంలో ఉన్న ప్రజా ప్రతినిధులను అడ్డుకుంటామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు సోమేశ్వర్ రెడ్డి మద్దిలేటి నాయుడు, ఎమ్మిగనూరు మండల కార్యదర్శి రాజీవ్, మంత్రాలయం మండల కార్యదర్శి లక్ష్మణ్ నాయక్, పార్టీ ప్రజాసంఘాల నాయకులు వీరేష్ మల్లికార్జున గౌడ్, కాజా, నరసింహులు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు

## ఎరువుల పంపిణీలో పారదర్శకతకు హొళగుందలో శిక్షణ

**మండల వ్యవసాయ అధికారి ఆనంద్ లోకదళ్**



హోళగుంద పల్లె వెలుగు జూన్ 08 హొళగుంద మండలంలోని రైతు సేవా కేంద్రం సిబ్బంది మరియు ఎరువుల వ్యాపారం చేసే ప్రైవేట్ డీలర్లకు ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ 2.ఓ (ఉ్రూూ×మీా 2.0) యాప్ ద్వారా యూరియా, డిఏపి ఎరువుల పంపిణీ విధానంపై సోమవారం మండల వ్యవసాయ అధికారి ఆనంద్ లోకదళ్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పారదర్శకంగా ఎరువులు అందించేందుకు ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందని తెలిపారు. ఈ యాప్ ద్వారా రైతుల ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్‌కు ఓటీపీ వచ్చిన తరువాత, వారి భూమి విస్తీర్ణం ఆధారంగా అర్హత మేరకు యూరియా, డిఏపి ఎరువులు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. రైతులకు కేటాయించిన ఎరువులను మూడు విడతల్లో రైతు సేవా కేంద్రం లేదా ప్రైవేట్ డీలర్ల ద్వారా పొందే అవకాశం ఉంటుందని, ఒకసారి ఎరువులు తీసుకున్న తర్వాత మరో 20 రోజుల తరువాత మాత్రమే తదుపరి విడత పొందగలరని తెలిపారు. రైతులకు అందజేసిన ప్రతి బ్యాగ్ యూరియా లేదా డిఏపి వివరాలను అదే రోజు ూ్రూూ×మీా 2.0 మరియు కేంద్ర ప్రభుత్వ ఐదీ యాప్‌లలో తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను ఉల్లంఘించిన డిఏపి సిబ్బంది, ప్రైవేట్ డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ప్రతి రైతు తమ వివరాలు ూ్రూూ×మీా 2.0 యాప్‌లో సక్రమంగా ఉన్నాయో లేదో సమీప రైతు సేవా కేంద్రంలో పరిశీలించుకోవాలని కోరారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది ఈ రోజు రాత్రిలోపు రైతుల డేటా 100 శాతం ధృవీకరణ పూర్తి చేసి, ప్రైవేట్ డీలర్ల మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి విరూపాక్షి, ప్రైవేట్ ఎరువుల డీలర్లు కాళికా ప్రసాద్, ప్రతాప్, లింగప్ప, రామిరెడ్డి తదితరులతో పాటు మండలంలోని అన్ని గ్రామాల రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల శిక్షణతోనే విద్యా ప్రమాణాల మెరుగుదల

**☛ షరీన్ నగర్ జెడ్పీహెచ్ఎస్ ఎఫ్ఎల్ఎన్ కేంద్రాన్ని పరిశీలించిన రాష్ట్ర పరిశీలకులు శ్రీమతి శ్రీకళ**

**☛ ఉపాధ్యాయులకు ఎంఈఓ శ్రీనివాసులు విలువైన సూచనలు**

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎఫ్ఎల్ఎన్ (ఖీూచీ) శిక్షణా తరగతులు స్థానిక షరీన్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (ూనూ) లో ఉత్సాహంగా సాగుతున్నాయి. సోమవారం ఈ శిక్షణా కేంద్రాన్ని




రాష్ట్ర స్థాయి పరిశీలకులు (్ఫూవ ూఎంవతీజవతీ) శ్రీమతి శ్రీకళ ఆకస్మికంగా సందర్శించారు.

ఈ సందర్భంగా ఆమె కేంద్రంలో ఉపాధ్యాయులకు అందిస్తున్న శిక్షణ తీరును, వారికి కల్పించిన మౌలిక వసతులను క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కోర్స్ డైరెక్టర్ మరియు స్థానిక మండల విద్యాశాఖాధికారి (వీజుూ) ఎం. శ్రీనివాసులు శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులను ఉద్దేశించి ప్రసంగించారు.

పాఠశాలల్లో బోధనా పద్ధతులను మరింత సులభతరం చేస్తూ, ప్రతి విద్యార్థికి అర్థమయ్యే రీతిలో ఎఫ్ఎల్ఎన్ మెళకువలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని ఆయన కోరారు. తరగతి గదిలో ఉపాధ్యాయులు అవలంబించాల్సిన ఆధునిక వ్యూహాలపై ఆయన పలు విలువైన సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో శిక్షణా కేంద్రం నిర్వాహకులు, రీసోర్స్ పర్సన్లు మరియు పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యం: జిల్లా ఇన్‌చార్జి మంత్రి.

క్షేత్రస్థాయిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే అసలైన విజయ ప్రమాణం.

**● ప్రతి శాఖ పనితీరులో క్రమంగా మెరుగుదల కనిపించాలి. ● ప్రభుత్వ కృషికి అనుగుణంగా అధికారులు ఫలితాలు చూపాలి. ● ప్రజాసేవలో జవాబుదారీతనం, పనితీరులో పురోగతి తప్పనిసరి. ● రాష్ట్రంలోనే జిల్లాను నంబర్‌వన్‌గా నిలబెట్టేందుకు సమష్టి కృషి అవసరం. ● సంక్షేమ పథకాలతో పాటు ప్రజల జీవన ప్రమాణాల్లో మార్పు రావాలి.**









పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.

ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు తీసుకురావడం ప్రతి అధికారి బాధ్యత అని జిల్లా ఇన్‌చార్జి మంత్రి మరియు రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నుల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా ఇన్చార్జి మంత్రి అధ్యక్షతన వ్యవసాయం, ఉద్యానవనం, తాగునీరు, జలవనరులు, పబ్లిక్ హెల్త్, అటవీ శాఖ, ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) తదితర అంశాలపై సుదీర్ఘ సమీక్ష జరిగింది. రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్, రాష్ట్ర రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, ఎమ్మెల్యేలు భూమా అఖిలప్రియ, బుడ్డా రాజశేఖర్ రెడ్డి, గౌరు చరితారెడ్డి, గిత్త జయసూర్య, కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు తీసుకురావడంతో పాటు రాష్ట్రంలోనే జిల్లాను అభివృద్ధి, ప్రజాసేవ, పరిపాలనలో ఆదర్శ జిల్లాగా నిలబెట్టేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. సమీక్షా సమావేశాలు కేవలం పనుల పురోగతిని అంచనా వేసేందుకు మాత్రమే కాకుండా అధికారుల్లో మరింత ఉత్సాహం, బాధ్యత మరియు సేవా దృక్పథాన్ని పెంపొందించేందుకు ఉపయోగపడాలని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధి కోసం చూపుతున్న అంకితభావం, కృషి ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడంలో ప్రభుత్వం విశేష ఫలితాలు సాధిస్తోందని, దేశంలోకి వస్తున్న పెట్టుబడుల్లో గణనీయమైన వాటా ఆంధ్రప్రదేశ్‌కు దక్కుతోందని తెలిపారు. గూగుల్ వంటి అంతర్జాతీయ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడం, పెద్ద పారిశ్రామిక సంస్థలు తక్కువ సమయంలోనే రాష్ట్రాన్ని పెట్టుబడులకు అనువైన గమ్యస్థానంగా గుర్తించడం ప్రభుత్వ సమర్థ పాలనకు నిదర్శనమన్నారు. పుట్టపర్తిలో ప్రారంభించిన ప్రతిష్టాత్మక ప్రాజెక్టును అత్యంత వేగంగా పూర్తి చేసి రాష్ట్ర ప్రతిష్టను అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు.

***ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో నిరంతరం కృషి చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, ప్రజా సేవల అందజేత, వివిధ శాఖల పనితీరుపై సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. విద్యుత్ రంగంలో రాష్ట్రం సాధించిన ప్రగతిని ప్రస్తావిస్తూ, ఒకప్పుడు విద్యుత్ కొరతతో ఇబ్బందులు ఎదుర్కొన్న పరిస్థితుల నుంచి నేడు వ్యవసాయానికి, గ్రామీణ ప్రాంతాలకు నిరంతర త్రీఫేజ్ విద్యుత్ సరఫరా అందించే స్థాయికి చేరుకున్నామని అన్నారు. విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తోందని, ప్రజలకు అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ సేవలు అందించడంలో అధికారులు మరింత చొరవ చూపాలని ఆదేశించారు. ప్రజాసేవను బాధ్యతగా, కర్తవ్యంగా భావించాలని, రైతులు, కూలీలు, ఆటో డ్రైవర్లు, చిన్న వ్యాపారులు వంటి సాధారణ ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రతి అధికారి తన పనితీరును నిరంతరం మెరుగుపరుచుకుంటూ ప్రతి నెలా కొంతైనా పురోగతి సాధించేలా కృషి చేయాలని సూచించారు.***

ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో ఏర్పడుతున్న సానుకూల అభిప్రాయాన్ని ముఖ్యమంత్రి ప్రతి నెలా సమీక్షిస్తున్నారని, అధికారుల పనితీరు నిరంతరం మెరుగుపడాలి తప్ప తగ్గకూడదని స్పష్టం చేశారు. ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ తదితర శాఖలకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో మద్దతు అందించిందని, గతంలో పెండింగ్‌లో ఉన్న బిల్లులను క్లియర్ చేయడంతో కొత్త పనుల అమలుకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తున్న నేపథ్యంలో అధికారులు కూడా వేగవంతంగా స్పందించి జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని సూచించారు. పనితీరులో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే తగిన చర్యలు తప్పవని, భవిష్యత్ పోస్టింగ్‌లు, బదిలీలు కూడా పనితీరు ఆధారంగానే నిర్ణయించబడతాయని హెచ్చరించారు.

పౌర సరఫరాల శాఖ పనితీరును సమీక్షిస్తూ రేషన్ డీలర్లు సమయానికి అందుబాటులో లేకపోవడం, వినియోగదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించకపోవడం, సరుకుల పంపిణీలో తేడాలు ఉండటం వంటి అంశాలపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పథకం తరహాలో రేషన్ పంపిణీ వ్యవస్థలో కూడా అధిక ప్రజా సంతృప్తి సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గోదాముల నుంచి తక్కువ బరువుతో సరుకులు అందుతున్నాయనే డీలర్ల ఫిర్యాదులపై స్పందిస్తూ, వేయింగ్ స్కేల్స్ ద్వారా బరువు ధృవీకరించి, ప్రింటెడ్ రశీదులతోనే సరుకులను లోడ్ చేయాలని ఆదేశించారు. పౌర సరఫరాల వ్యవస్థలో ఉన్న లోపాలను సరిదిద్ది పనితీరును మెరుగుపరిచే బాధ్యతను జాయింట్ కలెక్టర్ తీసుకోవాలని సూచించారు. అన్నా క్యాంటీన్ల పనితీరు రాష్ట్ర స్థాయిలో మెరుగుపడే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.

ఆర్టీసీ సేవలపై సమీక్షిస్తూ ప్రజల సంతృప్తి శాతం క్రమంగా తగ్గుతున్న విషయాన్ని ప్రస్తావిస్తూ, బస్ డిపోలలో మరుగుదొడ్లు, తాగునీరు, సీటింగ్ సౌకర్యాల కొరతతో పాటు సర్వీసులు సమయానికి అందకపోవడం ప్రధాన కారణాలని చెప్పారు. జిల్లాలోని బస్ డిపోలలో కనీస మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఉద్యోగులు కేవలం విధులు నిర్వహించడం కాకుండా సంస్థకు విలువను జోడించేలా పనిచేయాలని సూచించారు. రెవెన్యూ శాఖలో ఎఫ్-లైన్ సర్వే పనితీరు గత ఏడాదితో పోలిస్తే మెరుగుపడిందని పేర్కొంటూ, రవాణా శాఖలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షుణ్ణంగా విశ్లేషించి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. జిల్లాలో సైంటిఫిక్ డ్రైవింగ్ ట్రాక్‌ల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు వివరించగా, వాటికి ఆమోదం లభిస్తే డ్రైవింగ్ టెస్టుల్లో పారదర్శకత మరింత పెరుగుతుందని అభిప్రాయపడ్డారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై మాట్లాడుతూ తాగునీరు, గృహనిర్మాణం తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజల నుంచి వచ్చే అభిప్రాయాలను సానుకూల, ప్రతికూల ఫీడ్‌బ్యాక్‌లుగా వర్గీకరించి పనితీరును అంచనా వేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా పనిచేస్తోందని, అదే విధంగా అధికారులు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. గ్రామాల్లో వీధి దీపాల నిర్వహణ, పారిశుధ్యం, చిన్న అభివృద్ధి పనుల అమలుపై ప్రత్యేకంగా చర్చించారు. గ్రామాల్లో ఎన్ని వీధి దీపాలు పనిచేస్తున్నాయి, ఎన్ని పనిచేయడం లేదనే అంశాలపై సమగ్ర చెక్‌లిస్ట్ సిద్ధం చేయాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఆర్డీఎస్ఎస్ (డి ఆర్ ఎస్ ఎస్) పథకం కింద చేపట్టిన ప్రతి ఫీడర్ పనిని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాలు, ఈదురుగాలుల కారణంగా విద్యుత్ స్తంభాలు లేదా చెట్లు కూలి సరఫరాకు అంతరాయం కలిగితే వెంటనే మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని సూచించారు. ప్రభుత్వం నుంచి కొత్త పథకాలు మంజూరు కావాలంటే ప్రస్తుతం కొనసాగుతున్న ఆర్డీఎస్ఎస్ పనులను శాతం వంద పూర్తి చేయడం అత్యవసరమని స్పష్టం చేశారు.

మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల విషయంలో జిల్లాలో దాదాపు 9,340 పెండింగ్ కనెక్షన్లు ఉన్నాయని పేర్కొంటూ, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని వాటి మంజూరుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. శ్రీశైలం, నంద్యాల జిల్లాల్లో విద్యుత్ లైన్ల అప్‌గ్రేడేషన్, సబ్‌స్టేషన్ల నిర్మాణం వంటి అభివృద్ధి పనులకు అటవీ శాఖ అవసరమైన అనుమతులను ప్రాధాన్యతతో మంజూరు చేసి సానుకూల సహకారం అందించాలని కోరారు. అలాగే పాత విద్యుత్ లైన్ల ఆధునీకరణకు అవసరమైన అన్ని అనుమతులు త్వరితగతిన జారీ అయ్యేలా చూడాలని సూచించారు. శ్రీశైలం - దోర్నాల రహదారిపై ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, రోడ్డు పక్కన ఉన్న బర్మ్‌ను సురక్షితంగా నిర్వహించాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు. ఈ విషయంలో వివిధ శాఖల మధ్య సమన్వయం పెంపొందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అదే సమయంలో సంజామల మండలంలోని ఎగ్గొని గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఏర్పాట్లు పూర్తి చేసినప్పటికీ సంబంధిత పనులు నిలిచిపోయాయని తెలిపారు. ఈ అంశంపై ఎంఆర్‌ఓతో చర్చించి సమస్యను త్వరితగతిన పరిష్కరించి, పెండింగ్‌లో ఉన్న పనులు ప్రారంభమయ్యేలా ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు.

జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో గోస్పాడు ప్రాంతంలో 9 సెం.మీ., నంద్యాలలో 4 సెం.మీ. వర్షపాతం నమోదైందని, డోన్, ప్యాపిలి, కొలిమిగుండ్ల, బనగానపల్లి ప్రాంతాల్లో తక్కువ వర్షపాతం నమోదైన నేపథ్యంలో రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్నారని తెలిపారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా జూన్ 15 నుంచి జూలై 14 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటి సర్వే నిర్వహిస్తారని తెలిపారు. జిల్లాలో మొత్తం 14,05,443 మంది ఓటర్లు ఉన్నారని, అందులో 6,87,663 మంది పురుషులు, 7,17,497 మంది మహిళలు, 283 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారని వివరించారు. ఓటర్ల సమస్యల పరిష్కారం కోసం 1950 హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో 7 ఆర్టీసీ డిపోల ద్వారా రోజూ సుమారు 22 వేల మంది ప్రయాణికులకు సేవలు అందిస్తున్నామని చెప్పారు. అలాగే జిల్లాలో 2.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా, ఇప్పటివరకు 11,500 టన్నులు కొనుగోలు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ గడివేముల, పాణ్యం మండలాలకు సకాలంలో సాగునీరు అందడంతో మంచి దిగుబడులు వచ్చాయని తెలిపారు. గడివేముల ప్రాంతంలో మరింత ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. లో-వోల్టేజ్ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మాట్లాడుతూ ఆళ్లగడ్డ బస్టాండ్‌కు రహదారి నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు.

ఆర్టీసీ డిపోలకు ఆదాయ వనరులు పెంచి అభివృద్ధికి వినియోగించే అవకాశాలు కల్పించాలని కోరారు. ఎరువుల వినియోగ నియంత్రణ, రైతులకు ముందస్తు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య మాట్లాడుతూ జల జీవన్ మిషన్ పనులను నియోజకవర్గాల వారీగా కేటాయించాలని కోరారు.

ఆర్డీఎస్ కింద మిగిలిన గ్రామాలను ఫేజ్-2లో చేర్చాలని సూచించారు. కొలనుభారతి దేవస్థానానికి త్రీఫేజ్ విద్యుత్ సదుపాయం కల్పించాలని కోరారు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ ఆత్మకూరు--దోర్నాల రహదారిని విస్తరించి రాకపోకలకు అనుకూలంగా అభివృద్ధి చేయాలని కోరారు.

## రైతు శ్రేయస్సుకు ఎన్జీరంగా విశేష కృషి

మహానంది, పల్లె వెలుగు రైతుల శ్రేయస్సు కోసం ఆచార్య ఎన్జీరంగా విశేషంగా కృషి చేశారని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.జయలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం మహానందిలోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ కళాశాలలో ఆయన వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అసోసియేట్ డీన్ మాట్లాడుతూ.. ఆచార్య ఎన్.జి. రంగా గారు భారత రైతాంగ ఉద్యమ పితామహుడు, స్వాతంత్ర సమరయోధుడు, గొప్ప పార్లమెంటేరియన్, రైతుల సంక్షేమం కోసం ఆయన జీవితంతం పోరాడారని పేర్కొన్నారు. భారత పార్లమెంటు చరిత్రలో అత్యధిక కాలం ప్రజాప్రతినిధిగా సేవలందించిన మహనీయుడిగా ఆయన గుర్తింపు పొందారని తెలిపారు. జాతి పితా, మహాత్మ గాంధితో చర్చించిన విషయాలను" బాపు దీవెలను" అనే పుస్తక రూపంలో పొందుపరిచారన్నారు. ప్రొఫెసర్ హెడ్ డాక్టర్లు సుబ్బారామి రెడ్డి, వీరయ్య మాట్లాడుతూ.. రైతుల సేవ కోసం తన జీవితాన్ని అర్పించారన్నారు. వారి హక్కుల కోసం పోరాడినందుకు భారత ప్రభుత్వం ఎన్జీరంగా కు పద్మభూషణ్ తో సత్కరించారన్నారు. ఆయన సతీమణితో కలిసి సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ హెడ్ డాక్టర్ విజయ్ భాస్కర్, కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## రైతు సేవ కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులు త్రయాలు.

**వ్యవసాయ శాఖ ఏడిఏ బాలవర్ధిరాజు.**

ఆదోని (పల్లె వెలుగు): ఈరోజు ఆదోని సహాయ వ్యవసాయ సంచాలకులు బి. బాలవర్ధి రాజు మరియు ఆదోని మండల వ్యవసాయ అధికారి బి.వి.జి. సుధాకర్ ఆదోని మండలంలోని ఎరువుల దుకాణాలను సందర్శించి, ఏపీ ఏఐఎంఎస్ యాప్ ద్వారా యూరియా మరియు డిఏపీ ఎరువుల అమ్మకాలు ఏ విధంగా జరుగుతున్నాయో పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు ఎరువుల కొనుగోలు కోసం ఎరువుల దుకాణాలకు వచ్చినప్పుడు తమ ఆధార్ కార్డు మరియు ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ ఫోన్‌ను తప్పనిసరిగా వెంట తీసుకురావాలని సూచించారు. రైతుల గుర్తింపు మరియు ఓటిపి ధృవీకరణ అనంతరం మాత్రమే ఏపీ ఏఐఎంఎస్ యాప్ ద్వారా ఎరువుల పంపిణీ నిర్వహించబడుతుందని తెలిపారు. అదేవిధంగా, ఈరోజు నుండి రైతు సేవా కేంద్రాలు (ఆర్ఎస్ కేఎస్) మరియు ప్రైవేట్ ఎరువుల దుకాణాల ద్వారా యూరియా మరియు డిఏపీ ఎరువుల అమ్మకాలు పూర్తిగా ఏపీ ఏఐఎంఎస్ యాప్ ద్వారానే నిర్వహించబడతాయని, రైతులు ఈ విధానానికి సహకరించాలని కోరారు. ఖరీఫ్ సీజన్‌కు సరిపడా యూరియా మరియు డిఏపీ ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు తెలిపారు. అవసరమైన మేరకు ఎరువుల సరఫరా నిరంతరం కొనసాగుతుందని, రైతులు అనవసరంగా ఎరువులను నిల్వ చేసుకోవద్దని సూచించారు.



# యల్లమిల్లిలో త్రాగునీటి సమస్య పరిష్కారానికి అధికారుల యుద్ధప్రాతిపదికన చర్యలు



గండేపల్లి,పల్లె వెలుగు సోమవారం జూన్ 08 :- గ్రామంలో నెలకొన్న తీవ్ర త్రాగునీటి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఇచ్చిన ఆదేశాల మేరకు అధికారులు తక్షణమే స్పందించారు. ఈ మేరకు సోమవారం గ్రామంలో పర్యటించిన అధికారులు క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి తగిన చర్యలు చేపట్టారు. యల్లమిల్లి గ్రామ తెదేపా అధ్యక్షులు సుంకవిల్లి వీర వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో స్పెషల్ ఆఫీసర్ ఎమ్మార్వో పద్మజా రెడ్డి, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఇంజనీరు, విద్యుత్ శాఖ సహాయ ఇంజనీరు మరియు సంబంధిత సిబ్బంది ఈ పర్యటనలో పాల్గొన్నారు. గ్రామ చెరువు వద్ద ఉన్న బోరుకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడంతో పాటు, గండేపల్లి నుండి గ్రామానికి నీటిని సరఫరా చేసే ప్రధాన పైపులైనుకు మరమ్మతులు చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పనులను వేగవంతం చేసి, త్వరలోనే నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని వారు స్పష్టం చేశారు. సమస్యపై వేగంగా స్పందించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుంకవిల్లి వీర వెంకట సత్యనారాయణ, మద్దిపూడి వీర వెంకట సత్యనారాయణ, దేవిశెట్టి బాబ్జి, యల్లమిల్లి పంచాయతీ సెక్రెటరీ సిహెచ్ వివి సత్యనారాయణ, వివిధ మండల, విద్యుత్ మరియు నీటిపారుదల శాఖల అధికారులు పాల్గొన్నారు

# అంగన్‌వాడీ టీచర్లకు నవచేతన శిక్షణ: చిన్నారుల ఎదుగుదలకు కృత్రిమ మేధతో పర్యవేక్షణ



కిర్లంపూడి,పల్లె వెలుగు సోమవారం జూన్ 08 :- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు చిన్నారుల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవచేతన కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లకు ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. జూన్ 8న జగ్గంపేట మండలంలోని 60 మంది టీచర్లకు రాజపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, కిర్లంపూడి మండలంలోని 42 మంది టీచర్లకు బూరుగుపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షణ చేపట్టినట్లు శిశు అభివృద్ధి పథక అధికారిణి పూర్ణిమ తెలిపారు. శిశువు పుట్టినప్పటి నుంచి ఆరేళ్ల వయస్సు వరకు వారి ఎదుగుదలను కృత్రిమ మేధ సహాయంతో శాస్త్రీయంగా పరిశీలించే విధానాలపై ఈ శిక్షణలో అవగాహన కల్పించారు. వైద్యురాలు పూజ మాట్లాడుతూ పిల్లల జీవితంలో తొలి వెయ్యి రోజులు కీలకమని, నవచేతన ద్వారా వ్యాధులు, పోషకాహార లేమి, దివ్యాంగతలు వంటి సమస్యలను తొలిదశలోనే గుర్తించవచ్చని వివరించారు. శిక్షకురాలు ఉష మాట్లాడుతూ నవచేతన సాధనం ద్వారా పిల్లల మాట నైపుణ్యం, కదలికలు, తెలివితేటలు మరియు భావోద్వేగ ఎదుగుదలను అంచనా వేయవచ్చని పేర్కొన్నారు. ఇది కేవలం పరిశీలన సాధనం మాత్రమేనని, తుది నిర్ధారణ వైద్య నిపుణులే చేస్తారని పూర్ణిమ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బూరుగుపూడి వైద్యురాలు అంజలి, పర్యవేక్షకులు అమ్మాజీ, సునీత, బూసమ్మ, కరీమున్నిసా, అంగన్‌వాడీ టీచర్లు, ఆరోగ్య మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

# 1246వ రోజుకు చేరుకున్న లయన్స్ ఉచిత భోజన పంపిణీ కార్యక్రమం



తాళ్ళరేవు,పల్లె వెలుగు సోమవారం జూన్ 08 :- కాకినాడ జిల్లా తాళ్ళరేవు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లయన్ కె లక్ష్మయ్య బ్రహ్మార్పణ్ ఉచిత అభాగ్యుల భోజన పథకం సోమవారం నాటికి 1246వ రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమం నిరాటంకంగా కొనసాగుతూ సమాజంలో పేదలకు ఆసరాగా నిలుస్తోంది. సోమవారం నాటి కార్యక్రమానికి అన్నదాతగా లయన్స్ క్లబ్ సభ్యులు ఇందుకూరి సుబ్బరాజు మరియు సుజాత వ్యవహరించారు. తమ వివాహ వార్షికోత్సవం సందర్భంగా వారు ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందుకూరి సుబ్బరాజు, సుజాతల కుమారులు అక్షయ వర్మ మరియు అభినయ్ వర్మల చేతుల మీదుగా అభాగ్యులకు భోజనంతో పాటు సబ్జా లస్సీని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ సభ్యులు ఇందుకూరి సుబ్బరాజు, సుజాత దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వారి సేవా దృక్పథాన్ని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు

## ఏపీ ఆక్వా రైతు సంఘం కార్యదర్శి నాగభూషణంకు, ఘన సత్కారం



ముమ్మిడివరం,పల్లె వెలుగు సోమవారం జూన్ 08 :- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆక్వా రైతు సంఘం కార్యదర్శిగా త్సవటపల్లి నాగభూషణం నియమితులయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గం, కాట్రేనికోన మండలం చెయ్యేరు గ్రామంలోని ఆయన స్వగృహంలో శ్రీ ఉమారామలింగేశ్వర ఆక్వా రైతుల సంఘం ప్రతినిధులు, స్థానిక నాయకులు మరియు యువకులు నాగభూషణంను కలిసి గజమాలతో ఘనంగా సత్కరించారు. ఆక్వా రైతుల సమస్యల పరిష్కారం కోసం నాగభూషణం చేస్తున్న పోరాటాలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని వారు ఈ సందర్భంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో టీసీఎంటీ శ్రీను, టీ నాని, బసవా మురళి, ఎస్ రాఘవేంద్ర, ఎన్ శ్రీను, ఎన్ వెంకన్నబాబు, టీ మణికుమార్, టీ సారధి, ఎన్ సురేంద్ర, టీ హేమంత్, కె బలరామ్, జి అన్నవరం, పోలిశెట్టి రాజు, వి మూర్తి, ఎన్ బాబీ, ఎన్ సత్తింకాపు తదితరులు పాల్గొన్నారు

# జీవన యానంలో స్నేహం శ్వాస వంటిది

పల్లె వెలుగు:"స్నేహం ఓ వరం స్నేహాని కన్న మిన్న లోకాన లేదురా" అన్న మహాకవి వాక్య స్నేహం యొక్క ప్రాముఖ్యతను చాటుతుంది. స్నేహం అద్భుతమైంది.నిజమైన మిత్రులకు ఉంచిన ఆస్తి లేదు . స్నేహానికి ఎల్లలు లేవు అది సరిహద్దులనుచేరిపివేస్తుంది .మంచి మిత్రుడు తోడుంటే ఆయుధం ధరించినంత ధైర్యం ఉంటుంది. మనోధైర్యానికి మంచి మిత్రుడు తోడు నీడగా వుంటాడు. కల్లా కపటం ఎరుగని స్నేహం కలకాలం నిలిచి ఉంటుంది.జీవితం స్నేహంలి జీవితమనే ఉద్యానవనం లో అందమైన పుష్పం స్నేహం. హృదయపు తలుపులను ఒక సారి తడితే మాధుర్యం అంతా హృదయములో గుబాలిస్తుంది.ప్రతిఫలాన్ని ఆశించని స్నేహ బంధంలిమొగ్గలా ప్రారంభమై మహా. వృక్షం లా ఎదిగి జీవితాంతం తోడునిస్తుంది.

ఇద్దరు వ్యక్తులకు ఇరువురి మనసులకు సంబంధించిన స్నేహం తర తరాలకు తీపిని పెంచుతుంది.బంధాల పటిష్టత స్నేహంలికుటుంబాల మధ్య ఆత్మీయత అనురాగం అభిమానం ఆదరణ గౌరవం పటిష్ఠమైన సంబంధాల ను బలోపేతం చేస్తుంది. సమ కాలిన సమాజం మార్పులకు కాలానికి అతీతంగా మైత్రి మధురిమ ను పెంచుతుంది.కష్ట సుఖాల్లో అండ స్నేహంలికన్న వారితో కట్టుకున్న.వారితో తో బట్టువులతో చెప్పుకో లేని విషయాలను మిత్రులతో చెప్పుకోవడం స్నేహం గొప్పదనం

కష్ట సుఖాల్లో అండగా ఉండేవారు నిస్వార్థంగా సాయం అందించే వారు నిజమైన మిత్రులు.స్నేహం అనేది వివరించడం కష్టంలి స్నేహం స్కూల్లో నేర్చుకునేది కాదు.

లిస్నేహం యొక్క అర్థం నేర్చుకోక పోతేలిమీరు ఏ విం నే ర్చ్చ కో లే ర ు లి వ ు వా వ ుూ ద్ అలీ. స్నేహం ఓ మ ధ ు రా ను భ ూ తి. వ య ు న ు తో నిమిత్తం లేదు ఆట పాటలాడే బాల్యం నుండి వృద్ధ్యాప్యం వరకు అందరిలో స్నేహ భావంతో వుంటుంది. స్నేహాను బ . ˊ ా తి ని

అనుభవిస్తేతెలుస్తుంది.ఆస్వాదిస్తే అర్థం అవుతుంది.



సృష్టి స్నేహం సృష్టిలో నా అనేవారు బంధువులు లేని వారు ఉంటారేమో కానీ స్నేహితులు లేని వారు ఉండరు. ఇంట్లో చెప్పుకోలేని సమస్యలు బాధలు స్నేహితులతో ఎటువంటి దాపరికం లేకుండా చెప్పుకొని మనసుకు కలిగిన ఒత్తిడిని తగ్గించా కుంటారు ఓదార్పు పొందుతారు. జీవితాన్ని ఆశావహ దృక్పథం వైపు మళ్ళించే గొప్ప శక్తి స్నేహానికి వుంది.స్నేహం ప్రకృతిలి స్నేహం ప్రకృతి వంటిది. అధి అహల్లధం తో పాటు అనశీదాన్ని హాయిని ఇస్తుంది. కష్టాల్లో నేను ఉన్నాను అని బరోసా ఇస్తుంది. జీవన ప్రయాణంలో స్నేహం శ్వాస వంటిది. స్నేహం తీయనైనది.మనిషి జీవితంలో అమ్మ ప్రేమ మొదటి స్థానం స్నేహం రెండవ స్థానాన్ని దక్కించుకుంది. స్నేహితులతో కలిసి వుంటే కలిగే సంతోషం సంతృప్తి ఆనందం విలువైనది.మార్కెట్లో కొంటె దొరకనిధి స్నేహశీ.స్వచ్ఛత నమ్మకం సత్యసందత మంచి ప్రవర్తన పారధర్శనికథ తో కూడినపవిత్రమైన స్నేహం ఉండాలి .అలాంటి స్నేహం జీవితానికి ఆనందాన్ని ఇస్తుంది.

స్నేహితుల కోసం జూన్ 8 ఉత్తమ స్నేహితుల దినోత్సవం ప్రపంచ వ్యాప్తంగా ఐ'రా'స సభ్యదేశాలు ఉత్తమ స్నేహం గురించి స్నేహితులతో గడిపిన సమయం జీవితములో స్నేహం విలువ స్నేహం నిర్వహించే బహుముఖ పాత్ర గుర్తించి స్నేహ సంబంధాల ప్రాధాన్యత.గురించి అవగాహన చైతన్యం కలిగించి ప్రపంచ దేశాల మధ్య స్నేహ సౌభ్రాతృత్వ సౌహార్ధతతో కూడిన శాంతి సహనం సంఘీభావం సామరస్య వాతావరణాన్ని సృష్టించి ప్రపంచ్చాన్ని వసుదైక కుటుంభ ఆవిర్భావానికి స్నేహితుల దినోత్సవం దోహద పడుతుందని ఆశిద్ధాం.నేదునూరి కనకయ్య అధ్యక్షులు తెలంగాణ ఎకనామిక్ ఫోరం తెలంగాణ ఎడ్యుకేషన్ ఫోరంకరీంనగర్(జూన్8న జాతీయ ఉత్తమ స్నేహితుల దినోత్సవం)

# నంద్యాల అసెంబ్లీ ఎస్ డి పి ఐ కార్యకర్తల సమావేశం.

పల్లె వెలుగు నంద్యాల రూరల్. నంద్యాల అసెంబ్లీ








ఎస్ డి పి ఐ కార్యకర్తల సమావేశం స్థానిక కేకే ఫంక్షన్ హాల్‌లో నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్ డి పి ఐ జాతీయ కమిటీ సభ్యులు మరియు ఆంధ్రప్రదేశ్ ఇంచార్జ్ జహీర్ అబ్బాస్ , ఎస్ డి పి ఐ ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ గని పాల్గొన్నారు. ఈ సందర్భంగా జహీర్ అబ్బాస్ మాట్లాడుతూ, రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులను కార్యకర్తలు క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని, ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతూ పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం అబ్దుల్ గని మాట్లాడుతూ, పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయడంతో పాటు యువతను మరియు ప్రజలను పార్టీ వైపు ఆకర్షించే విధంగా కార్యాచరణ చేపట్టాలని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలను మరింత బలోపేతం చేస్తూ ఎస్ డి పి ఐ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎస్ డి పి ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు మరియు నంద్యాల జిల్లా ఇంచార్జి అడ్వకేట్ హుస్సేన్ పీరా గారు యంగ్ డెమొక్రట్స్ రాష్ట్ర నాయకులు అల్లాహ్ బకాష్,అజారుద్దీన్ నంద్యాల జిల్లా అధ్యక్షులు మణిహారం హనీఫ్ మరియు ప్రధాన కార్యదర్శి ఏజాస్ హుస్సేన్ , అసెంబ్లీ ప్రెసిడెంట్ ఫాజిల్ దేశాయ్, మరియు ప్రధాన కార్యదర్శి మక్బూల్ , ఆళ్లగడ్డ నాయకులు,నంద్యాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కార్మిక వర్గానికి కామ్రేడ్ సాదిక్ చేసిన సేవలు చిరస్మరణీయం.

పల్లెవెలుగు బేతంచెర్ల ప్రతినిధి (జూన్ 8):-- సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు బేతంచెర్ల లారీ మోటర్ వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపకులు సిఐటియు గౌరవాధ్యక్షులు కామ్రేడ్ ఎస్. సాధిక్ హుస్సేన్ కార్మిక వర్గానికి చేసిన సేవలు చిరస్మరణీయం అని, ఆయన ఆశయ సాధన కొరకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే ప్రభాకర్ రెడ్డి, నంద్యాల జిల్లా సిపిఎం పార్టీ కార్యదర్శి టి రమేష్ కుమార్, కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ గౌస్ దేశాయ్, జిల్లా కార్యవర్గ సభ్యులు పీఎస్ రాధాకృష్ణ అన్నారు. బేతంచర్ల మండలంలో సిపిఎం పార్టీ ఎర్రజెండా రెపరెపలాడడానికి, సిఐటియు కార్మిక వర్గ పునాదికి వ్యవస్థాపకులు, బేతంచెర్ల లారీ వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపకులు కామ్రేడ్ సాధిక్ హుస్సేన్ (72) సోమవారం తెల్లవారుజామున దాదాపు మూడు గంటల సమయంలో అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. విషయం తెలుసుకున్న సిపిఎం పార్టీ,సిఐటియు రాష్ట్ర ,జిల్లాల నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఆయన పార్టీ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ రాష్ట్ర నాయకులు కే. ప్రభాకర్ రెడ్డి, ఉమ్మడి జిల్లా కార్యదర్శులు ఎస్. గౌస్ దేశాయ్, టి.రమేష్ కుమార్, పిఎస్ రాధాకృష్ణ, వై. ఎల్లయ్య, వీ.లంక సుబ్బరాయుడు మాట్లాడుతూ, 1979 సంవత్సరంలో కార్మిక వర్గం పడుతున్న ఇబ్బందులను మృతుడు ఎస్ సాధిక్ హుస్సేన్, కామ్రేడ్ వెంకటయ్య, సూర్యనారాయణ చూసి చలించిపోయి బేతంచర్ల లో కార్మిక జెండా అయినటువంటి సిఐటియు కార్మిక జెండాను ప్రతిష్టించాలని ప్రయత్నం చేస్తున్న సందర్భంగా భూస్వాములు ఎర్రజెండా బేతంచర్లలో ఎగురవేయడానికి వీలులేదని అనేక నిర్బంధాలు పెట్టిన లెక్కచేయకుండా కార్మిక వర్గాన్ని ఏకం చేసి 1981లో కార్యాలయాన్ని ప్రారంభించిన సందర్భంగా భూస్వాములు అందరూ ఏకమై కార్మిక కార్యాలయం పై దాడి చేసి ధ్వంసం చేయడం జరిగిందని అన్నారు. అయినా లెక్క చేయకుండా భూస్వాములతో ఎదురొడ్డి నిలబడిన గొప్ప కార్మిక నాయకుడు సాదిక్ హుస్సేన్ అని వారు కొనియాడారు. ఆ తరుణంలో భూస్వాములు ఒక నిబంధన బేతంచర్ల లో ఎర్రజెండా ప్రతిష్టించాలంటే మీ కార్మిక వర్గంలో 18 మంది బేతంచెర్ల లో గాని బేతంచెర్ల



చుట్టుపక్కల గ్రామాలలో గాని కనబడకుండా పోవాలని హుకుం జారీ చేయగా మాకు కార్మిక శ్రేయస్సు ముఖ్యం కార్మిక క్షేమమే మాకు అతి ప్రధానమని అందుకు మా కుటుంబాలను సైతం త్యాగం చేయడానికి మేము సిద్ధము అని ఎస్ సాదిక్ హుస్సేన్,లంక సుబ్బరాయుడు వై.ఎల్లయ్య,రాముడు తదితరులు దాదాపు 18 మంది కార్మిక నాయకులు బేతంచెర్లలో భార్య పిల్లల ను కుటుంబాలను వదిలి నందికొట్కూరు ఆత్మకూరు, కర్నూలు ప్రాంతాలలో అజ్ఞాతవాసం చేయడం జరిగింది. అని గుర్తుచేసుకొని వారు కన్నీరు మున్నీరు కారుస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. ఆనాడు కేవలం 18 మందితో మొదలైన కార్మిక సంఘం ఈనాడు బేతంచెర్ల మండలంలో దాదాపు 20 కార్మిక సంఘాలను నిర్మించి సిపిఎం పార్టీ ఆవిర్భవించడానికి ఎస్ సాధిక్ హుస్సేన్ ఆయన బృందం అయినటువంటి మేము అందరము చేసిన కృషి ఫలితంగా బేతంచెర్ల మండలంలో ఎర్రజెండా రెపరెపలాడానికి కృషి చేయడం జరిగిందని అందులో మేం కూడా భాగస్వాముల అయినందుకు ఎంతో సంతోషకరంగా ఉందని



అన్నారు. అటువంటి గొప్ప నాయకుడైన మృతుడు ఎస్ సాధిక్ హుస్సేన్ ఆశయ సాధనకు ఎర్రజెండా పట్టిన ప్రతి నాయకుడు కార్యకర్త కృషి చేయడానికి పిడికిలెత్తి సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బేతంచెర్ల లారీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు బి రామాంజనేయులు, ఎస్ జాకీర్ హుస్సేన్, సిఐటియు , కార్యదర్శి ఎస్ కాజా బాషా, జి వేణుగోపాల్, డోన్ లారీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి శివరాం, నాగమద్దయ్య, వైబి వెంకటేశ్వర్లు, భాస్కర్, సంజీవ నాయుడు, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు ఏ మద్దిలేటి స్వామి, మద్దయ్య, పుల్లయ్య, మాలిక్ భాష, రామచంద్రుడు, మసాలా రాముడు, జలంధర్, టింగు, నాగరాజు, ధనుంజయుడు వెంకటేశ్వర్లు, పెద్దయ్య, రాజు, మధు, ఎస్ కే భాష, శేషు, రషీద్, సుబ్బరాయుడు, షేక్షావలి, శ్రీనివాసులు, లోకేష్, సిఐటియు నాయకులు సిపిఎం పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉయ్యాలవాడ తలారి 'రౌడీయిజం': పంట నమోదు బస్టాండ్‌లో..
# నిలదీస్తే బూతుల పర్వమా?!

## కలెక్టర్, ఎస్పీ పర్మిషన్ ఉంటేనే ఫోటోలు తీయాలా? తలారి 'సొంత రాజ్యాంగం'పై ముక్కున వేలేసుకుంటున్న జనం!

**☛జర్నలిస్ట్‌పై జేబురౌడీలా పడ్డ 'సేవకుడు' విజయుడు: ఫోన్ లాక్కొని, అనుచరులతో దాడికి యత్నం!**

**☛ఖాకీల దెబ్బకు దిగొచ్చిన గర్వం.. ఎఫ్ఐఆర్ నమోదు! కలెక్టర్ .. ఈ 'అవినీతి తిమింగలాన్ని' సస్పెండ్ చేయండి!**





పల్లె వెలుగు కర్నూలు జిల్లా రిపోర్టర్ : క్షేత్రస్థాయిలో ప్రభుత్వ వ్యవస్థలు ఎంతలా భ్రష్టుపట్టిపోతున్నాయో, కిందిస్థాయి సిబ్బందికి అధికార అహంకారం ఏ రేంజ్‌లో తలకెక్కిందో చెప్పడానికి ఓర్వకల్ మండలం ఉయ్యాలవాడలో జరిగిన ఈ అరాచకమే సజీవ సాక్ష్యం! సమాజంలో జరుగుతున్న అక్రమాలను వేలెత్తి చూపడమే ఆ జర్నలిస్ట్ చేసిన నేరమా? నిబంధనల ఉల్లంఘనను కెమెరాలో బంధిస్తే ఒక ప్రభుత్వ నౌకరు వీధి రౌడీలా ప్రవర్తించాలా? జర్నలిస్ట్‌పై బూతుపురాణంతో విరుచుకుపడి, భౌతిక దాడికి తెగబడ్డ స్థానిక తలారి (గ్రామ సేవకుడు) విజయుడి దౌర్జన్యకాండ ఇప్పుడు కర్నూలు జిల్లావ్యాప్తంగా పెను సంచలనం రేపుతోంది. పొలాలు వదిలి.. బస్టాండ్ అడ్డాగా సాగిన 'దగా'! గత ఏడాది అక్టోబర్ 6వ తేదీ ఉదయం 7:30 గంటల సమయం.. రైతుల పొలాల్లో తిరిగి, క్షేత్రస్థాయిలో వాస్తవాలను పరిశీలించి చేయాల్సిన అత్యంత కీలకమైన 'పంట నమోదు' (క్రాప్ బుకింగ్) కార్యక్రమాన్ని సదరు తలారి విజయుడు ఉయ్యాలవాడ గ్రామ బస్టాండ్ సెంటర్‌లో కూర్చొని దర్జాగా, తూతూమంత్రంగా కానిచ్చేస్తున్నాడు. ప్రభుత్వ ఆశయాలకు నడిరోడ్డుపై తూట్లు పొడుస్తూ సాగుతున్న ఈ పెద్ద దగాను స్థానిక జర్నలిస్ట్ మల్లికార్జున గమనించారు. నిబంధనల ఉల్లంఘనను సాక్ష్యాలతో సహా నిరూపించేందుకు తన మొబైల్ ఫోన్‌లో ఫోటోలు, వీడియోలు తీశారు.

**గుమ్మడికాయ దొంగలా ఉలిక్కిపాటు.. జర్నలిస్ట్‌పై వీధిరౌడీలా దాడి!**

తాను చేస్తున్న లీలలు ఎక్కడ పైఅధికారులకు తెలిసి తన ఉద్యోగం ఊడుతుందోనన్న భయంతో తలారి విజయుడు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు. తప్పు ఒప్పుకోవాల్సింది పోయి, 'ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటే' అన్నట్లు.. జర్నలిస్ట్ మల్లికార్జునపైకి లంఘించి ఆయన చేతిలోని మొబైల్ ఫోన్‌ను బలవంతంగా లాక్కున్నాడు. తాను జర్నలిస్ట్‌నని, ఫోన్ ఇవ్వాలని కోరినప్పటికీ.. కనీస సంస్కారం, ప్రభుత్వ ఉద్యోగి అనే విచక్షణ మరిచి, అందరి ముందూ అత్యంత నీచమైన పదజాలంతో బూతుపురాణం అందుకున్నాడు. అంతటితో ఆగకుండా, తన వెనుక ఉన్న 'బ్యాక్‌గ్రౌండ్' చూపిస్తానంటూ, తన అనుచరులను ఉసిగొల్పి జర్నలిస్ట్‌పై భౌతిక దాడికి సైతం తెగబడ్డాడు.

**తలారి 'సొంత' చట్టాలు!**

"పంట నమోదును రికార్డు చేయాలంటే కలెక్టర్, పోలీసుల పర్మిషన్ ఉండాలి.. లేకపోతే కుదరదు" అంటూ సదరు తలారి విజయుడు కొత్త చట్టాలు మాట్లాడటం చూస్తుంటే, అతని అజ్ఞానానికి, లోపల జరుగుతున్న పెద్ద అక్రమాలకు అద్దం పడుతోంది. ప్రభుత్వ కార్యక్రమాలను కవర్ చేసే జర్నలిస్టులకే పర్మిషన్లు కావాలంటున్న ఈ మేధావి.. పొలాలు వదిలి బస్టాండ్‌లో క్రాప్ బుకింగ్ చేయడానికి ఏ కలెక్టర్ పర్మిషన్ ఇచ్చారో సమాధానం చెప్పాలి! ఇందులో ఏదో పెద్ద కుంభకోణమే దాగి ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ఖాకీల షాక్.. పోలీస్ స్టేషన్‌లో 'ఎఫ్ఐఆర్' నమోదు!**

ఈ అరాచకంపై బాధితుడు మల్లికార్జున వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో న్యాయపోరాటానికి దిగారు. జర్నలిస్ట్‌పై దౌర్జన్యం అంటే ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని భావించిన పోలీసులు ప్రాథమిక విచారణ జరిపారు. తలారి విజయుడి దౌర్జన్యం, బూతుల పర్వం, బెదిరింపులు నిజమేనని తేలడంతో అతనిపై క్రిమినల్ కేసు (ఖీ×=) నమోదు చేసి గట్టి షాక్ ఇచ్చారు. చట్టం ముందు ఏ రౌడీజం సాగదని పోలీసులు నిరూపించారు.

**కలెక్టర్ యాక్షన్ ఏంటి..? తక్షణమే సస్పెండ్ చేయాల్సిందే!**

ఈ దౌర్జన్యకాండపై బాధితుడు సోమవారం కర్నూలు జిల్లా కలెక్టర్‌ను స్వయంగా కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు సమర్పించారు. "ప్రభుత్వ రూల్స్‌కు వ్యతిరేకంగా పంట నమోదు చేస్తూ, పెద్ద ఎత్తున అవినీతికి, అక్రమాలకు పాల్పడుతున్నారనే అనుమానంతోనే నాపై దాడి చేశారు" అని బాధితుడు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు ఇప్పటికే క్రిమినల్ కేసు నమోదు చేసినందున, ప్రభుత్వ నిబంధనలను నడిరోడ్డుపై ఖూనీ చేసి, విలేకరిపై దాడికి తెగబడిన సదరు తలారి విజయుడిని తక్షణమే ఉద్యోగం నుంచి సస్పెండ్ చేయాలని, శాఖాపరమైన విచారణ జరిపి కఠినంగా శిక్షించాలని జర్నలిస్ట్ సంఘాలు మరియు బాధితుడు జిల్లా కలెక్టర్‌ను బలంగా డిమాండ్ చేస్తున్నారు.

# పెండింగ్ గ్రీవెన్సులను బియాండ్ ఎస్ ఎల్ ఏ లోగా పరిష్కరించండి.

## ప్రభుత్వ ప్రాధాన్యత పథకాల అమలుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోండి.

**☛పిజిఆర్ఎస్ ద్వారా స్వీకరించిన 313 దరఖాస్తులు.**

**☛జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**








పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించి దరఖాస్తులను నాణ్యతతో నిర్ణీత కాల వ్యవధి లోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో అధికారులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించి, శాఖల మధ్య సమన్వయంతో లక్ష్యాలను సాధించాలని అధికారులను ఆదేశించారు. జూన్ 10 నుంచి 19 వరకు ప్రభుత్వం ప్రత్యేక థీమ్‌లతో నిర్వహించనున్న కార్యక్రమాలలో భాగంగా జూన్ 13న జిల్లాలో "బంగారు కుటుంబం" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 5 వేల మంది పాల్గొనేలా విస్తృత ఏర్పాట్లు చేయాలని సూచించారు. ముఖ్య ప్రణాళికాధికారి (సీపీఓ)ను నోడల్ అధికారిగా నియమించినట్లు పేర్కొంటూ, ఆర్డీఓలు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఈ కార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు.

అలాగే జూన్ 10 నుంచి 20 వరకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించే ఔట్‌రీచ్ కార్యక్రమాలకు సంబంధించి ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. లబ్ధిదారుల అనుభవాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత పథకమైన 'తల్లికి వందనం'కు సంబంధించిన సమస్యల పరిష్కారంలో కొందరు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న అంశాలను వెంటనే పరిష్కరించి నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

పీజీఆర్ఎస్ ద్వారా అందిన ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చోటుచేసుకోవడంపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గడువు దాటిన (బియాండ్ ఎస్ఎల్ఏ) ఫిర్యాదులను అత్యవసరంగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఎట్టి పరిస్థితుల్లోనూ గడువు పొడిగింపులు ఉండవని తెలిపారు. ప్రస్తుతం వివిధ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న గ్రీవెన్సులను తక్షణమే పరిష్కరించి, ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి సమస్యలను క్లియర్ చేయాలని ఆదేశించారు. బియాండ్ ఎస్-ఎల్ఏ కేసులను వెంటనే పరిష్కరించని అధికారులపై బాధ్యత నిర్ధారించి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న రీ-ఓపెన్ కేసులను వచ్చే సోమవారం నాటికి పూర్తిగా క్లియర్ చేయాలని ఆదేశించారు. నిర్దేశిత లక్ష్యాలను సాధించడంలో విఫలమయ్యే అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వివిధ అభివృద్ధి పనుల అమలులో శాఖల మధ్య సమన్వయ లోపాలు లేకుండా చూడాలని కలెక్టర్ సూచించారు. ప్రజలకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో అధికారులు సున్నితంగా స్పందిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. అక్షరాంధ్ర, యోగాంధ్ర, యూనిఫైడ్ ఫ్యామిలీ డేటా అప్‌డేట్, స్వర్ణగ్రామ్, స్వర్ణవార్డు తదితర కార్యక్రమాలకు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు నవీకరించాలని ఆదేశించారు. అన్ని శాఖలు ప్రభుత్వ లక్ష్యాల సాధనకు ప్రాధాన్యతనిస్తూ సమర్థవంతంగా పని చేయాలని కలెక్టర్ జి. రాజకుమారి సూచించారు.

**పీజీఆర్ఎస్ ద్వారా స్వీకరించిన ప్రజా ఫిర్యాదులు**

1) మిడ్తూరు మండలం, తలముడిపి గ్రామానికి చెందిన బి. చిన్నస్వామి తనకు సర్వే నెం.273లో 2.75 ఎకరాల భూమి ఉందని పేర్కొంటూ, ఆ భూమికి పట్టాదారు పాస్‌బుక్ మంజూరు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. 2) రుద్రవరం మండలం, ముత్తలూరు గ్రామానికి చెందిన సంగ రామసుబ్బయ్య తనకు చెందిన వ్యవసాయ భూమి ఆన్‌లైన్ రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా నమోదైందని, సంబంధిత రికార్డులను పరిశీలించి సవరణ చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు.

3) సిరివెళ్ల మండలానికి చెందిన జి. నారాయణ తనకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న అన్నదాత సుఖీభవ పథకం ప్రయోజనం అందలేదని పేర్కొంటూ, సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు సమర్పించారు.

# చొల్లంగిపేట గురుకుల పాఠశాలను యధావిధిగా కొనసాగించాలని కలెక్టర్‌కు వినతి



కాకినాడ,పల్లె వెలుగు సోమవారం జూన్ 08 :- కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం చొల్లంగిపేట గ్రామంలో సుమారు 25 ఏళ్లుగా కొనసాగుతున్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలను యధావిధిగా కొనసాగించాలని కోరుతూ సోమవారం కలెక్టర్ హరేందర్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఐఐటీ, నీట్ అకాడమీ ఏర్పాటు పేరుతో ప్రస్తుతం చదువుకుంటున్న విద్యార్థినులకు ఇబ్బందులు కలగకూడదని, అకాడమీ కోసం ప్రత్యేకంగా అదనపు భవనాలను నిర్మించాలని కోరారు. ప్రముఖ న్యాయవాది, విశ్వజన కళామండలి ఏపీ రాష్ట్ర అధ్యక్షులు యడ్ల కుటుంబరావు ఆధ్వర్యంలో ఈ వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ రొక్కం సత్యనారాయణ మూర్తి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ కొల్లి పద్మరాజు, తాళ్లరేవు మాజీ ఎంపీటీసీ సభ్యులు బొంతు వీర మోహన్, ఎండీయుడబ్ల్యూఏ సభ్యులు మరియు డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ రాజకుమారి పాల్గొన్నారు. విద్యార్థినుల భవిష్యత్తు దృష్ట్యా పాఠశాలను తరలించవద్దని వారు విన్నవించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ హరేందర్ ప్రసాద్, పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థినులకు ఎటువంటి అసౌకర్యం కలగదని, పాఠశాల యధావిధిగా కొనసాగుతుందని, ఎవరూ ఆందోళన చెందవద్దని హామీ ఇచ్చారు. తమ అభ్యర్థనను సానుకూలంగా స్వీకరించినందుకు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు

# దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి, కేజీ బాలకృష్ణన్ కమిషన్‌కు లక్ష సంతకాలతో వినతి





న్యూఢిల్లీ,పల్లె వెలుగు సోమవారం జూన్ 08 :- దళిత క్రైస్తవులకు రాజ్యాంగబద్ధమైన ఎస్సీ హోదా కల్పించాలని మరియు 1950 నాటి రాష్ట్రపతి ఆర్డినెన్స్‌ను రద్దు చేయాలని కోరుతూ దేశవ్యాప్తంగా సేకరించిన లక్ష మంది సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని రాష్ట్రీయ మసీహ్ పరిషత్ ప్రతినిధులు సోమవారం న్యూఢిల్లీలోని కేజీ బాలకృష్ణన్ కమిషన్ కార్యాలయంలో సమర్పించారు. సంస్థ జాతీయ అధ్యక్షులు డాక్టర్ అద్దంకి రంజిత్ ఓఫీర్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం కమిషన్ సభ్యులతో సమావేశమై, దళిత క్రైస్తవులు ఎదుర్కొంటున్న సామాజిక, విద్యా మరియు ఆర్థిక వెనుకబాటుతనాన్ని వివరించింది. మత మార్పిడి ప్రాతిపదికన ఎస్సీ హోదాను నిరాకరించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని వారు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా డాక్టర్ అద్దంకి రంజిత్ ఓఫీర్ మాట్లాడుతూ, దళిత క్రైస్తవులకు న్యాయబద్ధంగా ఎస్సీ హోదా కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. 1950 నాటి ఆర్డినెన్స్‌లో ఉన్న వివక్షతపూరిత నిబంధనలను తొలగించి సమాన హక్కులు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ అంశంపై దేశవ్యాప్తంగా ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోందని, ఇప్పటికే లక్ష సంతకాలను సేకరించామని తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని లక్షలాది సంతకాలను సేకరించి సంబంధిత అధికారులకు అందజేస్తామని ఆయన స్పష్టం చేశారు